ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com



vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు
RNI TGTEL/25/A5065






Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 142 సోమవారం 11 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-


Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 142 Monday 11 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-


# నరేంద్ర మోదీజీ పెద్ద మనసుతో సహకరించండి



- మోదీ పెద్ద మనసు కలవారని వాళ్లు చెబుతుంటారు
- మోదీకి రేవంత్ విజ్ఞప్తి
- తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోదీ సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి వినతి
- గుజరాత్ మోడల్ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ సహకరించినట్టే తనకు మద్దతివ్వాలని విజ్ఞప్తి
- 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దుతామని హామీ
- రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా సమీక్షించాలని మనవి

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి హిందీలో ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించారు. దేశాభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేస్తామని స్పష్టం చేస్తూనే, తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను ప్రధాని ముందుంచారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడూ మోదీ చాలా పెద్ద మనసున్న వారని చెబుతుంటారు, ఆ పెద్ద మనసుతో తెలంగాణ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మోదీని రేవంత్ కోరారు. దేశ ప్రగతికి సంబంధించిన విషయాల్లో రాజకీయాలు చేయబోమని, వికసిత్ భారత్ నిర్మాణంలో తెలంగాణను భాగస్వామిని చేస్తామని ఆయన ప్రధానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం కేవలం కేంద్ర ప్రభుత్వానిది కాదని, ఇది తెలంగాణ అభివృద్ధి ఉత్సవమని రేవంత్ రెడ్డి అన్నారు. "ప్రధాని మోదీ - మిగతా 2 లో

## నా మీద కుట్రలు పన్ని నన్ను ఏదో చేయాలని చూస్తున్నారు



- మోదీ సభలో బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు
- తలెత్తుకునే పనే చేస్తాను తప్ప, తలదించుకునే పని చేయనన్న బండి సంజయ్
- కొందరు తన మీద కుట్రలు పన్ని తనను ఏదో చేయాలని చూస్తున్నారని వ్యాఖ్య

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** సికింద్రాబాద్ బహిరంగ సభలో కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఏరోజూ పార్టీ తలవంచుకునే పనులు చేయనని, తలెత్తుకునే పనే చేస్తాను తప్ప తలదించుకునే పని చేయనని అన్నారు. కొందరు తన మీద కుట్రలు పన్ని ఏదో చేయాలని చూస్తున్నారని భావోద్వేగభరితంగా ప్రసంగించారు. రాజకీయంగా - మిగతా 2 లో




## ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌తో మంత్రి కోమటిరెడ్డి భేటీ

- తెలంగాణ ప్రాజెక్టులపై చర్చ
- డెత్ రోడ్‌గా మారిన NH-65పై ప్రమాదాల నివారణకు చర్యలు
- నాగపూర్ తరహాలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం
- స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ సహా ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరు

## తెలంగాణలో రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

- ప్రధాని మోదీ చేతుల మీదుగా తెలంగాణలో రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన
- భారత్ 'రిఫార్మ్స్ ఎక్స్‌ప్రెస్' వేగంతో దూసుకెళ్తోందన్న ప్రధాని మోదీ
- ఈ ప్రాజెక్టులతో కనెక్టివిటీ మెరుగుపడి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని హామీ



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా తెలంగాణలో సుమారు రూ. 9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, - మిగతా 2 లో

# 'నేను మీ అందరివాణ్ని'

- తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జోసెఫ్ విజయ్
- చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సీఎంగా ప్రమాణం
- ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం
- తమిళనాట లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైందన్న సీఎం విజయ్
- యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం దస్త్రాలపై విజయ్ సంతకాలు
- తమిళనాడుకు ఇది సరికొత్త ప్రారంభమని ప్రమాణస్వీకార కార్యక్రమంలో వెల్లడి
- డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడని, తాను అందరివాడినని విజయ్ తెలిపారు





**వార్త సంధ్య, చెన్నై, మే 10 :** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జోసెఫ్ విజయ్, ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం చేశారు. ఆ తర్వాత యాంటీ డ్రగ్ టాస్క్‌ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం దస్త్రాలపై విజయ్ సంతకాలు చేశారు. తమిళనాడుకు ఇది సరికొత్త ప్రారంభమని ప్రమాణస్వీకార కార్యక్రమంలో వెల్లడించారు. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో విజయ్‌తో గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ సీఎంగా ప్రమాణం చేయించారు.అయితే సీఎంగా ప్రమాణం చేశాక విజయ్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తమిళనాట లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైందని అన్నారు. తాము సాధ్యమయ్యేవే చెబుతామని, చెప్పిందే చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మిత్రులైనా శత్రువులైనా అందరికీ ఒకే చట్టమని స్పష్టం చేశారు. తాను విజయ్ మామ అని, అన్నీ మంచి పనులు చేస్తాడని చెప్పారు.డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడని, తాను అందరివాడినని విజయ్ తెలిపారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి వచ్చానని, తనను ఎంతోమంది ఎన్నోరకాలుగా ఇబ్బందిపెట్టారని ఆరోపించారు. కానీ అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని తెలిపారు. టీవీకేలో ఒకే ఒక అధికార కేంద్రం ఉందని, అది విజయ్ మాత్రమేనని స్పష్టం చేశారు. తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. హామీల అమలుకు కొంత సమయం - మిగతా 2 లో

## చంద్రబాబు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయిన ప్రధాని మోదీ



- జూబ్లీహిల్స్ లో చంద్రబాబు నివాసానికి వెళ్లిన మోదీ
- ప్రధానికి సాదర స్వాగతం పలికిన చంద్రబాబు, లోకేష్

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ హైదరాబాద్ పర్యటకు విచ్చేశారు. ఈ క్రమంలో, జూబ్లీహిల్స్ లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు. తమ ఇంటికి వచ్చిన ప్రధానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ మంత్రి నారా లోకేష్ సాదర స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబుతో మోదీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై చర్చించుకున్నారు. - మిగతా 2 లో




## రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఏపీ తీరంపై వాతావరణ మార్పులు
- రెండు రోజుల్లో అల్పపీడనం
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడే అవకాశం
- మన్నార్ గల్ఫ్ వద్ద కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

# భిన్నత్వంలో ఏకత్వమే మన దేశాన్ని కలిపి ఉంచుతోంది

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే శక్తివంతం
- ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- ధ్యాన్ మందిరాన్ని ప్రారంభించిన ప్రధాని భారత ఆధ్యాత్మిక విలువలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్నాయని వ్యాఖ్య
- 'భారత ఆధ్యాత్మిక విలువలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి
- భిన్నత్వంలో ఏకత్వమే మన దేశాన్ని కలిపి ఉంచుతోందని ప్రధాని మోదీ అన్నారు
- 'భారత్ అనేక వైవిధ్యాలతో నిండిన దేశం. ఎన్నో భాషలు, సంప్రదాయాలు, ఆచారాలు, పూజా విధానాలు ఉన్నాయి



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే అత్యంత శక్తివంతమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సమాజ శక్తిని మేల్కొల్పినప్పుడే ఏ ఉద్యమమైనా విజయవంతమవుతుందని అన్నారు. సమాజాన్ని ఏకం చేయడంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ విశేష పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఆదివారం బెంగళూరు పర్యటనలో భాగంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్తగా నిర్మించిన ధ్యాన్ మందిర్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.'భారత ఆధ్యాత్మిక విలువలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ పురాతన సంప్రదాయాల నుంచే స్ఫూర్తి కొనసాగుతోంది. ఆ స్ఫూర్తితోనే 45 ఏళ్ల క్రితం శ్రీశ్రీ రవిశంకర్ 45 ఏళ్ల క్రితం ఆర్ట్ ఆఫ్ లివింగ్ అనే విత్తనం నాటారు. ఈరోజు అది మహా వటవృక్షంలా ఎదిగింది. ఏ ఉద్యమమైనా సమాజ శక్తి తోడైతేనే విజయం సాధిస్తుంది. ప్రతి ముఖ్యమైన - మిగతా 2 లో




## నేడు సింగపూర్‌లో మంత్రి నారా లోకేష్ పర్యటన

- సింగపూర్‌లో పర్యటించనున్న మంత్రి నారా లోకేష్
- జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొంటారు
- ప్రముఖ సంస్థల సీఈవో, సీఎఫ్ఓలతో సమావేశం కానున్నారు
- డీపీ ఆర్కిటెక్ట్స్ ప్రతినిధులతోనూ భేటీ కానున్న లోకేష్

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ప్రధాని మోదీ



- ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను పరామర్శించిన ప్రధాని
- పవన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మోదీ
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష.. కృతజ్ఞతలు తెలిపిన పవన్

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 10 :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం - మిగతా 2 లో

# సంపాదకీయం

## ప్రజా ఐక్యత గీతం

పర్వత శిఖరములపై పలికిన కవితా నాదమది
పృథ్వీ గర్భమంతట పరిమళించి విరజిల్లె;
భాషల గోడలన్నియు భగ్నమగునని బోధించి
భావాల సేతువై మానవ హృదయములను కలిపె.

కులమత భేదముల కలుషిత చీకటిలో
కరుణా కాంతిరేఖలై కవిత వెలుగె;
విభేద వలయముల విరిచి సమత్వ మార్గమున
సామరస్య సుగంధమై సమాజమున పరచె.

పేదవాని నిశ్వాసము, ధనవాని గర్వగీతము
ఒకే రాగమై కలిసిన క్షణమున
సమానత్వ సత్యమై సమాజ గర్భమందు
స్నేహ స్వరమై సర్వలోకమున మార్మోగె.

సరిహద్దు రేఖలతో భూమిని చీల్చిన చేతులకన్నా
స్నేహసూత్రమే శాశ్వతమని కాలమే చెప్తుంది;
మనసుల నదులన్నియు ఒకే సముద్రమై చేరగా
మానవత్వమే జగతికి మహాసంగీతమవుతుంది.

కావున కవిత కేవలం పదాల అలంకారముకాదు
ప్రజల హృదయాలను కలిపే పవిత్ర జ్యోతి అది;
ప్రపంచ కవితా స్వరమై మార్మోగిన వేళ
ప్రజల ఐక్యత రాగమే భూమికి శాశ్వత గీతమవుతుంది.

రచన: మంజుల పత్తిపాటి
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218

## భిన్నత్వంలో ఏకత్వమే మన దేశాన్ని కలిపి ఉంచుతోంది

**మొదటిపేజీ తరువాయి -** కార్యక్రమానికి సమాజ శక్తిని మేల్కొలపడం అత్యవసరం. నేను ఎప్పుడూ ఒక విషయాన్ని నమ్ముతాను. రాజకీయాలు, ప్రభుత్వాల కంటే సమాజమే ఎక్కువ శక్తివంతం. దేశ నిర్మాణంలో ప్రజలు చురుకుగా పాల్గొంటేనే ఏ ప్రభుత్వం విజయవంతమవుతుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.భిన్నత్వంలో ఏకత్వమే మన దేశాన్ని కలిపి ఉంచుతోందని ప్రధాని మోదీ అన్నారు. 'భారత్ అనేక వైవిధ్యాలతో నిండిన దేశం. ఎన్నో భాషలు, సంప్రదాయాలు, ఆచారాలు, పూజా విధానాలు ఉన్నాయి. ఈ అంతా కలిపి ఉంచే మూల సూత్రం ఏమిటన్న ప్రశ్న మనలో తలెత్తుతుంది. దానికి సమాధానం మన కోసం కాకుండా ఇతరుల కోసం జీవించడం. సంకల్పం స్పష్టంగా ఉండి, సేవాభావంతో పని చేస్తే ప్రతి ప్రయత్నం మంచి ఫలితాలనే ఇస్తుంది.' అని మోదీ చెప్పారు. సభ జరిగిన ప్రాంగణంలోని పద్మాకార పైకప్పును ప్రస్తావిస్తూ ప్రధాని సరదాగా వ్యాఖ్యానించారు. 'ఇంకేం జరిగినా మనమందరం కమలం నీడలోనే ఉన్నాం. గురుదేవ్ ఆశీస్సులతో ఈ కమలం దేశాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది' అని పేర్కొన్నారు.డిజిటల్ యుగంలో భారత్ సాధిస్తున్న



పురోగతిని కూడా ప్రధాని ప్రస్తావించారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచిందని చెప్పారు. స్టార్టప్ వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, మౌలిక వసతులు, అంతరిక్ష సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుత పురోగతి సాధిస్తోందని తెలిపారు. ఈ విజయాల వెనుక యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భారత్ కేవలం శాస్త్రీయ ఆవిష్కరణల్లో భాగస్వామి మాత్రమే కాదని, అనేక రంగాల్లో నాయకత్వం వహిస్తోందని అని మోదీ పేర్కొన్నారు. సాంకేతికత ద్వారా దూరంగా ఉన్నవారు కూడా వెంటనే కలిసే పరిస్థితి వచ్చిందని, అయితే ప్రపంచంతో అనుసంధానం ఎంత ముఖ్యమో మనతో మనం అనుసంధానం కావడం కూడా అంతే అవసరమని ప్రధాని వ్యాఖ్యానించారు. మానసిక ప్రశాంతత కలిగిన, సామాజిక బాధ్యత గల యువతే వికసిత్ భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. యోగా, ధ్యానం, మానసిక ఆరోగ్య కార్యక్రమాల ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణలో మరింత చురుకుగా పాల్గొనాలని ప్రధాని పిలుపునిచ్చారు. అనారోగ్యానికి కూడా ప్రజలు సహజ చికిత్సల వైపు చూస్తున్నారు. మన భూమాతకూ సహజ వైద్యం అవసరం. రసాయన ఎరువులు భూమిని దెబ్బతీశాయి. భూమాతను రసాయనాల నుంచి రక్షించడం కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో భాగమే. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణ లేకుండా స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదు. ఎకాలజీ, ఎకానమీని వేరు చేయలేం' అని మోదీ పేర్కొన్నారు.

## 'నేను మీ అందరివాణ్ని'





**మొదటిపేజీ తరువాయి -** ఇవ్వండని, డీఎంకే ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని ఆరోపణలు చేశారు."మహిళలు, యువకులు, రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, మత్స్యకారులు మన టీవీకే ప్రభుత్వంలో అందరూ బాగుంటారు. పుట్టుకతో ప్రతి ఒక్కరూ సమానమే అనేది మన రాజీలేని ప్రాథమిక సిద్ధాంతం. మైనారిటీ సోదరులారా, మన టీవీకే ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది. ఇందులో మీకు ఎలాంటి సందేహం అవసరం లేదు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరి ప్రతిరూపమే ఈ విజయ్ ముఖం. మీరు నూరు శాతం ఈ విజయ్‌ను నమ్మవచ్చు. ఇంతటి గొప్ప అవకాశాన్ని కల్పించిన తమిళనాడు ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను ముఖ్యంగా ఇంకొకరికి కూడా కృతజ్ఞతలు చెప్పాలి వాళ్లే ఈ విజయ్ మామ చిట్టి నేస్తాలు. వాళ్ల వల్లే ఇదంతా సాధ్యమైంది. మీ రుణం ఎలా తీర్చుకోవాలో మీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ విజయ్ మామ మీ కోసం అన్ని మంచి పనులు చేస్తాడు. నమ్మకంతో ఉండండి. రండి, మనమంతా కలిసి ఒక సరికొత్త పరిపాలనను అందిద్దాం.ప్రమాణ స్వీకారం అనంతరం సచివాలయానికి వెళ్లిన విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నూతన సీఎంకు అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు కేబినెట్‌లో ప్రస్తుతం మిత్రపక్షాలకు నేతలకు చోటు దక్కలేదు. మిత్రపక్షాలను సంప్రదించి తర్వాత కేబినెట్ విస్తరణ చేయనున్నట్లు సమాచారం. విజయ్ తల్లిదండ్రులు చంద్రశేఖర్, శోభా చంద్రశేఖర్, ఇతర కుటుంబ సభ్యులు, టీవీకే నాయకులు, మద్దతు ఇచ్చిన పార్టీ నాయకులు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. కార్యకర్తలు, సినీ ప్రముఖులు సైతం విజయ్ ప్రమాణ స్వీకారానికి వచ్చారు.ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు. మరోవైపు విజయ్‌కు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజకీయ, సామాజిక చైతన్యాన్ని దీర్ఘకాలంగా నిర్వచిస్తూ వస్తున్న ఆదర్శాలు, పాలనను ముందుకు నడిపిస్తాయని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన పేర్కొన్నారు."తమిళనాడు వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ప్రజలు, ముఖ్యంగా ఆశయాలు కలిగిన యువత, టీవీకేపై తమ నమ్మకాన్ని ఉంచారు. ఆయన నాయకత్వంలో ఆదర్శాలు పాలనను ముందుకు నడిపిస్తూనే, దేశానికి స్ఫూర్తినిస్తాయని నాకు పూర్తి నమ్మకం ఉంది. కరుణ, సమ్మిళితత్వం, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడంలో కొత్త ప్రభుత్వం గొప్ప విజయాన్ని సాధించాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు.

## తెలంగాణలో రూ. 9,400 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి -** కనెక్టివిటీ, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

ప్రధాని ప్రారంభించిన, శంకుస్థాపన చేసిన కీలక ప్రాజెక్టుల వివరాలు ఇవి:

హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్: ఇందులో భాగంగా సూరారం నుంచి మహబూబ్‌నగర్ వరకు రూ. 3,180 కోట్లతో 84 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు.

కాజీపేట-విజయవాడ మల్టీ-ట్రాకింగ్: ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 1,200 కోట్లతో నిర్మించిన 118 కిలోమీటర్ల రైల్వే లైన్లను జాతికి అంకితం చేశారు.

కాజీపేట రైల్ అండర్ బైపాస్: కాజీపేట జంక్షన్‌లో రైళ్ల రాకపోకలను సులభతరం చేసేందుకు రూ. 2,300 కోట్లతో నిర్మించిన 21 కిలోమీటర్ల బైపాస్‌ను ప్రారంభించారు.

గ్రీన్‌ఫీల్డ్ పీఓఎల్ టెర్మినల్: మల్కాపూర్‌లో ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) టెర్మినల్‌ను ప్రారంభించారు.

పీఎం మిత్ర పార్క్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రూ. 1,700 కోట్లతో ఏర్పాటు చేయనున్న పీఎం మిత్ర పార్కుకు శంకుస్థాపన చేశారు.

**ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. "నేటి భారత్ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' మీద నడుస్తోంది. అదే సమయంలో ఆధునిక మౌలిక సదుపాయాలను కూడా వేగంగా నిర్మిస్తోంది. ఈ రోజు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు వేలాది ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తాయి, తెలంగాణ కనెక్టివిటీని మరింత బలోపేతం చేస్తాయి" అని మోదీ అన్నారు."ఒకప్పుడు ప్రపంచంలో భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పుడు, మన టెక్స్‌టైల్ పరిశ్రమ కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు వరంగల్‌లోని పీఎం మిత్ర పార్క్ దేశంలో టెక్స్‌టైల్ విప్లవాన్ని వేగవంతం చేస్తుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు."గత 12 ఏళ్లుగా ఆధునిక కనెక్టివిటీకి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు... ఇలా ప్రతి రవాణా మార్గంపై అపూర్వమైన పెట్టుబడులు పెడుతున్నాం. గత 11





ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయింది. కేవలం జాతీయ రహదారుల కోసమే సుమారు రూ. 1.75 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాం" అని వివరించారు.రైల్వే బడ్జెట్‌పై మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల కంటే తక్కువగా ఉండేది. కానీ నేడు ఒక్క తెలంగాణకే ఈ ఏడాది రూ. 5,500 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి" అని తెలిపారు.ప్రపంచంలో ఇంధన భద్రత ప్రాముఖ్యత పెరిగిందని, అందుకే తమ ప్రభుత్వం దీనిపై భారీగా పెట్టుబడులు పెడుతోందని చెప్పారు. సౌరశక్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలిచిందని అన్నారు. "ఈ మౌలిక సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్లు పెట్టుబడి పెడుతోంది. ఇది తెలంగాణ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. తెలంగాణలోని ప్రతి కుటుంబ సభ్యుని కలలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం మరింత వేగంతో పని చేస్తుందని హామీ ఇస్తున్నాను" అని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.


## నరేంద్ర మోదీజీ పెద్ద మనసుతో సహకరించండి

**మొదటిపేజీ తరువాయి -** వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రకటించిన రోజే, దానికి అనుగుణంగా మేం 'తెలంగాణ రైజింగ్ 2047' పాలసీ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. దేశాన్ని 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న మీ కలను సాకారం చేయడంలో తెలంగాణ 10% వాటాను అందిస్తుంది. దేశ జనాభాలో 3% కంటే తక్కువ ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5% వాటాను తెలంగాణ అందిస్తోంది. రానున్న రోజుల్లో దీన్ని 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం" అని వివరించారు.ఈ లక్ష్య సాధన కోసం ఒక ఆసక్తికరమైన పోలికను ప్రధాని ముందుంచారు. "గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు, మీరు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆనాడు మీ 'గుజరాత్ మోడల్'కు ఆయన సహకరించారు. ఇప్పుడు మీరు ప్రధానిగా ఉండగా, నేను ముఖ్యమంత్రిగా ఉన్నాను. రాష్ట్ర ప్రజలు నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. రానున్న పదేళ్లలో 'తెలంగాణ మోడల్' నిర్మించి,




2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి మీ ఆశీస్సులు, సహకారం ఎంతో అవసరం" అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.దేశానికి ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాలు గ్రోత్ ఇంజన్ల వంటివని, ఈ నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ నగరాల నుంచి వచ్చే అభివృద్ధి ప్రతిపాదనలకు సత్వరమే అనుమతులు ఇచ్చేందుకు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ లేదా సింగిల్ విండో వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.తెలంగాణకు అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, మూసీ నది సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ రేడియల్ రోడ్లు, హైదరాబాద్-మచిలీపట్నం పోర్టు మధ్య 12 లైన్ల ఎక్స్‌ప్రెస్ హైవే, రైల్వే లైన్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను సీఎం రేవంత్ ప్రస్తావించారు. "ఈ ప్రాజెక్టులపై చర్చించేందుకు తెలంగాణ కోసం ఒక రెండు గంటల సమయం కేటాయించి ప్రత్యేక సమీక్ష నిర్వహించండి. మా ప్రతిపాదనలన్నింటినీ మీ ముందు ఉంచుతాం" అని కోరారు.

## నేడు సింగపూర్‌లో మంత్రి నారా లోకేష్ పర్యటన



**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సోమవారం (మే 11) నాడు ఆయన సింగపూర్ లో పర్యటించనున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. ఇందులో భాగంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొంటారు.షెడ్యూల్ ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఎంటీఐ కార్యాలయంలో జరిగే జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ సమావేశంలో లోకేష్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం సింగపూర్‌లోని సన్ టెక్ సిటీలో వరుస భేటీలు జరపనున్నారు.మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు కమోడిటీస్ ఇంటిలిజెన్స్ సెంటర్ (సీఐసీ) సీఈవో, సీఎఫ్ఓలతో సమావేశమవుతారు. ఆ తర్వాత 2:30 నుంచి 3 గంటల వరకు డీపీ ఆర్కిటెక్ట్స్ సంస్థ ప్రతినిధులతో లోకేష్ భేటీ అవుతారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సంబంధించిన అంశాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

## రాగల 48 గంటల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం



**మొదటిపేజీ తరువాయి -** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. రాబోయే 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అమరావతి వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. మన్నార్ గల్ఫ్, దానిని ఆనుకుని ఉన్న శ్రీలంక పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతోనే ఈ అల్పపీడనం ఏర్పడనుందని పేర్కొన్నారు.ప్రస్తుతం ఈ ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి స్థిరంగా కొనసాగుతోంది. ఇది మరింత బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.మరోవైపు, మధ్య, ఎగువ స్థాయి పశ్చిమ గాలుల్లో కొనసాగుతున్న ద్రోణి కోస్తాంధ్రపై ప్రభావం చూపుతోంది. సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ద్రోణి... ఈశాన్య బీహార్ నుంచి జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌లోని మధ్య భాగాల వరకు విస్తరించి ఉంది. ఈ రెండు వాతావరణ వ్యవస్థల ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## చంద్రబాబు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి -** ఈ భేటీలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. అదే సమయంలో, తెలంగాణలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలపై మాట్లాడుకున్నట్టు తెలుస్తోంది.ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో, తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాల నేపథ్యంలో ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.అంతకుముందు, ప్రధాని మోదీ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.హైదరాబాద్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ గచ్చిబౌలిలో సింధు ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సింధు ఆసుపత్రిని పరిశీలించారు.

## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన ప్రధాని మోదీ

**మొదటిపేజీ తరువాయి -** జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌ను కలుసుకున్న ప్రధాని మోదీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.పవన్‌ను పరామర్శించిన అనంతరం, ప్రధాని మోదీ జూబ్లీహిల్స్ లోనే ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి వెళ్లారు.

## నా మీద కుట్రలు పన్ని ఏదో చేయాలని చూస్తున్నారు

**మొదటిపేజీ తరువాయి -** ఎదుర్కోలేక దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై దుష్ప్రచారాలను ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే వ్యక్తిని కాదని, ప్రజల మధ్య తిరిగే వ్యక్తినని పేర్కొన్నారు. తండ్రి పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తిని కాదని స్పష్టం చేశారు.

## ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్‌తో మంత్రి కోమటిరెడ్డి భేటీ



**మొదటిపేజీ తరువాయి -** ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోశ్ కుమార్ యాదవ్‌తో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు.ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోశ్ కుమార్ యాదవ్‌తో తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి (వీఱఅఱర్‌వతీ ఖశీఝఅతీవసఎ ఎవఅఝ్ =వసఎ) ఆదివారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. హైదరాబాద్‌లో పలు జాతీయ రహదారి ప్రాజెక్టులపై మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్ పనులు త్వరగా ప్రారంభించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ విజయవాడ చీఎ-65ను 8 లేన్ల విస్తరణపై చర్చించారు.డెత్ రోడ్‌గా మారిన NH-65పై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి సూచించారు. ఎల్బీనగర్ హయత్‌నగర్ మధ్య 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ ప్రతిపాదించినట్లు వివరించారు. నాగపూర్ తరహాలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని కోరారు. ఇప్పటికే డీపీఆర్‌ని పంపినట్లు వెల్లడించారు. NH-65 టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు సంతోశ్ కుమార్ యాదవ్ తెలిపారు. మంత్రి కోమటిరెడ్డితో పాటు స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ సహా ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# గుంజపడుగుకు 30 లక్షల నిధులు మంజూరు

**- మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన**

**సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్**



**మంథని, మే 10(వార్త సంధ్య) :** మంథని మండలం గుంజపడుగు గ్రామంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు ల చిత్రపటాలకి ఆదివారం సర్పంచ్ దండెవేన సంధ్య భానేష్ ల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. గుంజపడుగు గ్రామంలో సిఆర్ఆర్ కాంపోనెంట్ నిధుల కింద 30 లక్షల రూపాయల సిసి రోడ్లు, డ్రైనేజీలు కేటాయించిన మంత్రి కి ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్య భానేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండెవేన సంధ్య మాట్లాడుతూ గుంజపడుగు గ్రామాభివృద్ధికి శ్రీధర్ బాబు చేసిన కృషిని గుంజపడుగు గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీ రోడ్డు గుంతలతో రోడ్డు బాగాలేక గ్రామ ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి చొరవతో ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం పట్ల ఎస్సీ కాలనీవాసులతోపాటు గుంజపడుగు గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుంజపడుగు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ఊదరి శంకర్, ఊదరి ఓదెలు, మిటుకు రామ్మూర్తి, భోగె మల్లేష్, రేగల్ల రామన్న, ఊదరి శంకర్, కాసిపేట శ్రీకాంత్, లక్కీపురం రాజు, ఎస్సీ కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపదలో అండగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే 10 (వార్త సంధ్య) :** పెద్దపల్లి పట్టణానికి చెందిన 80 సంవత్సరాల ఒక వృద్ధురాలు శనివారం తన ఊపిరితిత్తుల్లో నీరు చేరి తీవ్రమైన ఆయాసం తో మస్సివే రైట్ సైడెడ్ ప్లేరల్ ఏఫ్ఫ్యూషన్ తో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. డ్యూటీ లో వున్న డాక్టర్ మరియు పేషెంట్ మనుమడు రవి కరబుజ ,వెన్నంపల్లి వాస్తవ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ కి విషయం చెప్పగా స్పందించిన సూపరింటెండెంట్ మన ఆసుపత్రిలో పని చేస్తున్న పల్మనరీ మెడిసిన్ వైద్యుడు అయిన డా. కిరణ్ కి విషయం తెలుపగా వెంటనే స్పందించి సదరు మహిళకు చికిత్స చేసి ఊపిరితిత్తులలో ఉన్న నీటిని తీసివేశారు. ఇప్పుడు ఆ మహిళ కోలుకొని ఆరోగ్యంగా ఉంది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా. కిరణ్ ని మరియు సహకారం అందించిన డా వినయ్ ఫిజియన్ ని ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా పేషెంట్ బంధువులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మదర్స్ డే సందర్భంగా
# మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో బట్టల పంపిణీ

**అమ్మ ప్రేమకు ఈ ప్రపంచంలో సరితూగేది ఏదీ లేదు**

**మాతృమూర్తుల పట్ల గౌరవం చాటిన ప్రజాప్రతినిధులు**

**నూతన తల్లులకు చీరలు చిన్నారులకు బట్టలు అందజేసిన కార్పొరేటర్**

**మదర్స్ డే వేడుకల్లో భావోద్వేగ సందేశం**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 10 (వార్త సంధ్య) :** మదర్స్ డే సందర్భంగా కొత్తగూడెం నగరపాలక సంస్థ 18వ డివిజన్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఆదివారం హృదయాన్ని హత్తుకునే కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా తల్లులైన మహిళలకు నైటీలు, చీరలు పంపిణీ చేయడంతో పాటు చిన్నారులకు బట్టలు అందజేసి మాతృత్వానికి గౌరవం చాటారు.ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హిమాశ్రీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య పాల్గొని తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య మాట్లాడుతూ భావోద్వేగంగా ప్రసంగించారు. “ఈ ప్రపంచంలో ‘అమ్మ’ అనే పదం కన్నా విలువైన పదం మరొకటి లేదు. మనం ఈ లోకంలోకి వచ్చిన తర్వాత ముందుగా తెలిసేది అమ్మ ప్రేమే. అమ్మను మించిన దైవం లేదు. అమ్మ అనే పదంలో ఆప్యాయత, అనురాగం, ఆనందం, తీయదనం, అమితమైన ప్రేమ నిండివుంటాయి” అని అన్నారు. మదర్స్ డే సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నూతన తల్లులకు చీరలు, నైటీలు అందజేసి అభినందనలు తెలిపారు. చిన్నారులకు బట్టలు పంపిణీ చేసి వారి ఆరోగ్యం, భవిష్యత్తు బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు వాక్కుపల్లి హరినాథ్, బరిగెల భూపేష్, మండల రాజేశ్వరరావు, నిఖిల్, నరేందర్, బాబు ఖాన్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వ అండ..

**పినపాక మండలంలో లబ్ధిదారులకు ఆర్థిక భరోసా**

**బయ్యారం క్రాస్ రోడ్ కాంగ్రెస్ కార్యాలయంలో కార్యక్రమం**

**అవసర సమయంలో ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెల్లడి**

**సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం**

**30 మందికి రూ.15 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 10 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో వివిధ అనారోగ్య సమస్యలు మరియు అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అవసరమైన 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా సుమారు రూ.15 లక్షల విలువైన చెక్కులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. బయ్యారం క్రాస్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో ఉపయోగకరంగా మారుతోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రామవరం 16వ డివిజన్‌లో అధ్వాన్న పారిశుధ్యం

**అంబేద్కర్ పార్క్ ముందే చెత్త కుప్పలు**

**దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు**

**వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన**

**పారిశుధ్య నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారంటూ విమర్శలు**

**ప్రజల్లో తీవ్ర ఆగ్రహం, తక్షణమే స్పందించాలని**

**కార్పొరేటర్‌కు ప్రజల విజ్ఞప్తి**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 10 (వార్త సంధ్య) :** రామవరం 16వ డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంబేద్కర్ పార్క్ ముందు భారీగా చెత్త పేరుకుపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు విశ్రాంతి తీసుకునే పార్క్ పరిసరాలు చెత్త కుప్పలతో నిండిపోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని, దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ పారిశుధ్య సిబ్బంది సరైన విధంగా పని చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. “ఇలాంటి దుస్థితి ఉంటుందని ఊహించలేదుడ ప్రజలు నిత్యం ఈ చెత్త మధ్యనే జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది” అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రామవరం 16వ డివిజన్ కార్పొరేటర్ వెంటనే స్పందించి సంబంధిత కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి అంబేద్కర్ పార్క్‌తో పాటు డివిజన్‌లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పారిశుధ్యం నిర్లక్ష్యం చేస్తే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# గురువర్యుల పట్ల కృతజ్ఞత చాటిన ఎమ్మెల్యే పాయం

**గురువు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావుడు**

**నేనొక నిత్య విద్యార్థిని”, “స్వగతాలకు స్వాగతాలు” పుస్తకాల ఆవిష్కరణ**

**ఘనంగా ఎర్రా ప్రగడ రామమూర్తి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం**

**సాహిత్యాభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కళకళలాడిన సభ**





**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 10 (వార్త సంధ్య):** ప్రముఖ సాహితీవేత్త, విశిష్ట ఉపాధ్యాయులు, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు గురువర్యులు అయిన ఎర్రా ప్రగడ రామమూర్తి రచించిన “స్వగతాలకు స్వాగతాలు” మరియు “నేనొక నిత్య విద్యార్థిని” పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం పినపాక మండలంలోని జివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుస్తకాలను ఆవిష్కరించి రచయిత ఎర్రా ప్రగడ రామమూర్తిని ఘనంగా సన్మానించారు. గురువుపట్ల తనకున్న గౌరవం, అభిమానాన్ని సభా వేదికగా వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. “గురువు అనేది కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదుడ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మహానుభావులు. నా గురువర్యులు రామమూర్తి గారు అందించిన మార్గదర్శకత్వం, విలువలు, క్రమశిక్షణ నా ప్రజా జీవితానికి పునాది” అని భావోద్వేగంగా పేర్కొన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి గురువులదేనని కొనియాడారు. గురువును సన్మానించే అవకాశం రావడం తనకు గర్వకారణమని అన్నారు. “నేనొక నిత్య విద్యార్థిని” పుస్తకం జీవితాంతం నేర్చుకోవాలనే భావనను పెంపొందించే గొప్ప గ్రంథమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చదవదగిన పుస్తకమని, యువతలో చదువుపై ఆసక్తిని పెంచేలా ఈ రచన ఉంటుందని తెలిపారు. అలాగే “స్వగతాలకు స్వాగతాలు” పుస్తకం ఆత్మపరిశీలనకు దారి తీసే సాహిత్య కృతిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు పుస్తకాలు సమాజానికి స్ఫూర్తినిచ్చే ఆలోచనలను అందిస్తాయని చెప్పారు.

# వైభవంగా రైతు వారోత్సవాలు

**రైతు సంక్షేమం ఆధునిక వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

Inauguration of Exhibition Stalls by Hon'ble Minister for Agriculture, Sri Tummala Nageswara Rao





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 10 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న “ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక” 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన “రైతు వారం” కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అయినా ఉద్యానవన పట్టు పరిశ్రమ , విద్యుత్, మార్కెటింగ్, సహకార, పశుసంవర్ధక ,మత్స్య శాఖ, పౌర సరఫరా నీటిపారుదల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు

### నేల ఆరోగ్యం శాస్త్రీయ సాగుకు తొలి అడుగు

మే 4న వికారా బాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు వారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన సేంద్రీయ ధ్రువీకరణ అధారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రైతు వారోత్సవాల్లో 222762 రైతులు,5850 అధికారులు,8157 ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు వినియోగదారులు కోరుకునే మరియు మార్కెట్లో అధిక డిమాండ్ కలిగిన సన్న వరి రకాలు బీపీటీ 5204 , ఆర్ ఎన్ ఆర్ 15048, హెచ్ఎంటి, జైశ్రీరామ్, కే ఎన్ ఎం.1638, డబ్ల్యు జి ఎల్ 44, డబ్ల్యు జి ఎల్ 962, జేజిఎల్ 1798 వంటి రకాలను సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు

### ఆధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం

మే 5న హనుమకొండలో గౌరవ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శ్రీమతి కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం, నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై



ప్రత్యేక అవగాహన కల్పించారు.

### మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టి

మే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు.

### యాంత్రీకరణ సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన

మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. రైతులు పాల్గొన్న ఈ కార్యక్రమాల్లో 1,344 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించారు. 370 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అలాగే పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, సబ్సిడీలపై అవగాహన కల్పించారు.రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న శ్రీ వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు గారు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుం దని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వరికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం

Participation of Dr.Gopi, IAS., Director of Agriculture, Hyderabad on eve of Farmers week



ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు, ఈ వానాకాలం రైతుల కోసం ముందస్తుగానే ఎరువుల విత్తనాల అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ మరియు అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మాత్యులతో పాటుగా మంత్రులు శ్రీమతి కొండా సురేఖ ఎంపీ కావ్య శాసనసభ్యులు శ్రీహరి వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్ ఐ.ఏ.ఎస్, డా.బి. గోపి ఐ.ఏ.ఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ .ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


### పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం

రైతు వారం ఐదవ రోజున పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా 593 కృత్రిమ గర్భధారణ క్యాంపులు నిర్వహించి, 35,336 పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు.అదేవిధంగా 2,654 మంది రైతులకు పచ్చిగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు.మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్ర నీటి విని యోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికపై వివరించారు.నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో కాలువల మరమ్మత్తులు, చెరువుల పూడికతీత పనులు వేగవంతం చేయడంపై అవగాహన కల్పించారు.చెరువుల గట్లపై పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గుర్రపుడెక్క తొలగింపు మరియు కాలువల శుభ్రత కార్యక్రమాల ప్రాముఖ్యత వివరించారు.చెరువుల నల్లమట్టి వినియోగం వల్ల నేల సారవంతం పెరుగుతుందని రైతులకు తెలియజేశారు.మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రతపై అవగాహన కార్యక్రమాలతో రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయిఈ రైతు వారోత్సవ కార్యక్రమాలు రైతులకు శాస్త్రీయ అవగాహన ఆధునిక సాంకేతిక ఆర్థిక భరోసా అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతున్నాయి రైతు సంక్షేమం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగం మరింత బలపడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుంది

**డా.బి. గోపి , ఐ.ఏ.ఎస్ వ్యవసాయ సంచాలకులు**
**వ్యవసాయ శాఖ హైదరాబాద్ తెలంగాణ.**

# చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో భేటీ అయిన మంత్రి కోమటి రెడ్డి వెంకటన్ రెడ్డి

**రాష్ట్రంలోని పలు ప్రాజెక్ట్స్ పై చర్చించిన మంత్రి**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 10 :** నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ తో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం హైదరాబాద్ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ - విజయవాడ-65విస్తరణ పనులు ప్రారంభం పై ప్రత్యేకంగా చర్చించారు. నిత్యం యాక్సిడెంట్స్ తో డెత్ రోడ్ గా పిలువబడుతున్న హైదరాబాద్ - విజయవాడ రహదారి 8లేన్ విస్తరణ పనులు వీలైనంత త్వరగా చేపట్టాలని కోరారు. ఇదే రహదారిలో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు నాగపూర్ తరహాలో 7.1కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి, డీపీఆర్ కు పంపిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. హైదరాబాద్ - విజయవాడ, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అతి త్వరలో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చైర్మన్ మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న,చేపట్టబోయే పలు ప్రాజెక్టుల అంశాలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామ్యంగా నిలిచే ప్రాజెక్టులు త్వరగా పూర్తయేలా చూడాలని చైర్మన్ ను మంత్రి కోరారు.

మంత్రి వెంట రోడ్లు భవనాలు శాఖ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్,ప్రత్యేక కార్యదర్శి ప్రావిణ్య, రీజినల్ ఆఫీసర్ శివ శంకర్,ఆర్ అండ్ బి సి.ఈ లు ధర్మారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు

### అంతిమ యాత్రలో పాల్గొని పాడే మోసిన దుద్దిళ్ల శ్రీను బాబు



**మంథని, మే 10(వార్త సంధ్య) :** మహదేవ్ పూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ వార్డ్ సభ్యులు పర్శవేణి రాజమల్లు యాదవ్ నిన్న రాత్రి గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి అంతిమ యాత్రలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు

## ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ అడ్మిషన్లు...

### పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విలీనంపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### భాగస్వాములతో విస్తృత సంప్రదింపులు.. శాసనసభలో చర్చ తర్వాతే నిర్ణయం

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 10 :** హైదరాబాద్: ఈ ఏడాది యథావిధిగా ఇంటర్మీడియట్ ప్రవేశాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉండడంతో విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని సీఎం సూచించారు. ఇంటర్మీడియట్ ను రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని.. ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సీబీఎస్ఈతో పాటు మెజారిటీ రాష్ట్రాలు 11, 12 తరగతుల విధానాన్ని అనుసరిస్తున్నాయి. మన రాష్ట్రంలో



మాత్రం ఇంటర్మీడియట్ విద్య వేరుగా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి వరకు చదివిన విద్యార్థుల్లో అత్యధికులు ఆ తర్వాత ఇంటర్మీడియట్‌కు వేరుగా ఉన్న కళాశాలల్లో చేరడం లేదు. అప్పటితో విద్యను నిలిపివేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్‌ను వేరుగా కాకుండా 11, 12 తరగతులుగా కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గతంలో అధికారులకు సూచించారు. ఇదే అంశాన్ని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ సైతం తన నివేదికలో పేర్కొంది. ఇటీవల ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు నిలిపివేస్తూ అధికారులు ప్రకటన విడుదల చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, విద్యా శాఖ కమిషనర్ యోగితా రాణాలతో చర్చించారు. విలీనంతో ముడిపడిన పలు సాంకేతిక సమస్యలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేయాలని నిర్ణయించారు. విలీన ప్రక్రియకు సంబంధించి భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై నియమించిన కమిటీ అధ్యయనం చేసి తన నివేదిక సమర్పించాలని సీఎం సూచించారు. అనంతరం శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## హెచ్ఐసీసీ లో పలు అభివృద్ధి పథకాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 10 : కార్యక్రమం.హాజరైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

## హెచ్ఐసీసీలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం..

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 10 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి, గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కి, కేంద్ర మిత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, హాజరైన మిత్రులందరికీ స్వాగతం. ఇది అభివృద్ధి ఉత్సవం.. కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం కాదు. జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధే మనకు అత్యధిక ప్రాధాన్యం... ముందు భారత దేశం, తర్వాత ప్రజలు, ఆ తర్వాతే పార్టీ అనేది స్పష్టం. ఆ స్ఫూర్తితోనే దేశ నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ గారు వికసిత్ భారత్ 2047ను ప్రకటించినప్పుడు, మేము భాగస్వాములయ్యాం. తెలంగాణ రైజింగ్‌కు మీరు పూర్తి సహకారం అందిస్తారనే విశ్వాసం మాకు ఉంది. తెలంగాణను దేశంలో మొదటి స్థానంలో నిలిపేందుకు మేం ప్రయత్నిస్తున్నాం.. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు మోదీ వచ్చారు... అయిదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయి... మోదీ ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధి పనులకు వచ్చారు..మనం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.. మోదీ , గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ సహకారంతో మీరు గుజరాత్ మోడల్‌ను అభివృద్ధి చేశారు.. తెలంగాణ ప్రజలు కూడా రాబోయే పదేళ్లలో మీ సహకారంతో మా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నారు. నాటి మన్మోహన్ సింగ్ విధంగా, ఆయన స్ఫూర్తితో మీరు నాకు పూర్తి సహకారం అందిస్తారని విశ్వసిస్తున్నా... 2034లో 1 ట్రిలియన్



డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామనే నమ్మకం ఉంది... 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకుంటామని ఆశిస్తున్నా.. నాడు మన్మోహన్‌సింగ్ ఆశీస్సులు అందించినట్లే మీరు తెలంగాణ ప్రజలకు ఆశీస్సులు అందించాలి... భారీ ఆర్థిక వృద్ధి, మహా నగరాలు, విశ్వ నగరాల నుంచే వస్తుంది.. మనకు ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్ ఆరు మహా నగరాలున్నాయి. ఈ దేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉండాలంటే, యువతకు ఉద్యోగాలు రావాలంటే ఈ మహా నగరాలను అభివృద్ధి చేయాలి... ఈ ఆరు మెట్రో నగరాలకు సంబంధించిన జాతీయ ప్రాధాన్యత గల అన్ని ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అనుమతులు త్వరగా లభించేలా ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రత్యేక సింగిల్ విండో టాస్క్ ఫోర్స్ ఉండాలి.. మోదీ , నా రాష్ట్రం, నా ప్రజల కోసం సానుకూల నిర్ణయాల విషయంలో నేను మిమ్మల్ని, కేంద్ర మంత్రులను అనేకసార్లు కలిశాను.. మా రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రాజెక్టులకు మీ అత్యవసర అనుమతులు, ఆమోదాలు అవసరం. మూసీ నది, మెట్రో రైలు, రేడియల్ రోడ్లు, హైదరాబాద్-మచిలీపట్నం వరకు 12 వరుసల రహదారికి సంబంధించి రెండు గంటల పాటు మీరు సమయం కేటాయించి సమీక్షించాలి... కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్ మిత్రులు.. మీకు పెద్ద మనస్సు ఉందని చెబుతున్నారు.. మోదీ గారూ మీకు పెద్ద మనస్సు ఉందని తెలంగాణ తెలుసు. నేడు వారు దాన్ని ప్రత్యక్షంగా చూడాలనుకుంటున్నారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ పనులు, ప్రతిపాదనలు అన్నింటినీ ఈరోజు మీరు ఆమోదిస్తారని తెలంగాణ ప్రజలు ఆశిస్తున్నారు.. దేశం విషయంలో మేం మీతో కలిసి ఉన్నాం.. మీరు వికసిత్ భారత్ 2047పైన మాట్లాడి, భారతదేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే అంశంపై మాట్లాడినప్పుడు,మేం మా రాష్ట్ర కోణంలో 'తెలంగాణ రైజింగ్ 2047'ను దానికి అనుసంధానం చేశాం..

**ప్రధానమంత్రి కి ధన్యవాదాలు..**

**జై తెలంగాణ, జై భారత్**

## పరిపూర్ణ బాలల ఆశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ..



**తిరువూరు,మే 10(వార్త సంధ్య):-** ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం తిరువూరు పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల పరిపూర్ణ బాలల ఆశ్రమంలో నివసిస్తున్న చిన్నారులకు లయన్స్ క్లబ్ తిరువూరు వారి ఆధ్వర్యంలో గంగిరెడ్డి సీతాలక్ష్మి జ్ఞాపకార్థం వారి భర్త లయన్ గంగిరెడ్డి రాధాకృష్ణ నిత్యావసర సరుకులను విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులు అమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు నిర్వహించారు. సమాజ సేవా భావంతో ముందుకు వచ్చి చిన్నారులకు అవసరమైన సరుకులను అందజేసిన గంగిరెడ్డి రాధాకృష్ణ ను ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు. పరిపూర్ణ బాలల ఆశ్రమ నిర్వాహకులు సిరికొండ నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి. వి రావు కి అలాగే చిన్నారుల సంక్షేమానికి సహకరిస్తున్న దాతలకు ఎల్లప్పుడూ కృతజ్ఞతలు ఉంటాయని తెలిపారు.ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న వారు గంగిరెడ్డి కుటుంబ సభ్యుల సేవా స్ఫూర్తిని ప్రశంసించారు.

## వివాహ కార్యక్రమంలో పాల్గొన్న నల్లగట్ల స్వామిదాస్...



**గంపలగూడెం,మే 10 (వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం.** గంపలగూడెం మండలం కనుమూరు గ్రామంలో పగడాల నాగేశ్వరరావు మరియు పుల్లమ్మ దంపతుల కుమారుడు గోపరాజు - రమ్య ల వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే తిరువూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి నల్లగట్ల స్వామిదాస్. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ సెక్రటరీ చెరుకు నర్సారెడ్డి,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి కి అధికారులు సకాలంలో హాజరు కావాలి

### భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 10 (వార్త సంధ్య) :** మే, 11వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## మందలపు రోజారాణి వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరం



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కేపీహెచ్‌బీ వసంత నగర్ డివిజన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్ కాలనీలో ఆదివారం ఘనంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయి బాబు చౌదరి సతీమణి, కీర్తిశేషులు శ్రీమతి మందలపు రోజా రాణి మూడవ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. మందలపు రోజా రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) సౌజన్యంతో డాక్టర్ సోమశేఖర రావు నేతృత్వంలో శిబిరం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సాయి బాబు చౌదరి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతూ, పేదల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో పాల్గొన్న డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో 'ఫ్యాటీ లివర్' సమస్య పెరిగిపోతోందని, కేవలం ఆల్కహాల్ వల్లే కాకుండా జీవనశైలి మార్పుల వల్ల కూడా లివర్ దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఫైబ్రో స్కాన్ ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని తనిఖీ చేసుకోవాలని సూచించారు.బిపి,ఈసీజీ 2డిఎకో , ఫైబ్రో స్కాన్ , జి.ఆర్.బి.ఎస్ , కంటి పరీక్షలు, బరువు, పల్స్ రేట్ మరియు ూజూూ2 తనిఖీలు ఈ మెగా హెల్త్ క్యాంపులో సుమారు 300 మందికి పైగా కాలనీవాసులు పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గాడుదుల గండి సమీపంలో యువకుని మృతదేహం

**- పెద్దపల్లి జిల్లాలో దళిత యువకుడి దారుణ హత్య**

**పది రోజుల తర్వాత కుళ్ళిన స్థితిలో వంశీ మృతదేహం లభ్యం**

**మంథని, మే 10(వార్త సంధ్య) :** మంథని మండలం ఎగ్లాస్ పూర్ గ్రామ శివారులోని గాడుదుల గండి వద్ద ఆదివారం యువకుని మృతదేహం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే సంచలన సృష్టించిన దళిత యువకుడు జూల వంశీ హత్యతో కుటుంబ సభ్యులు, దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. రామగిరి మండలం సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల వంశి అనే యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మంథని మండలం గాడుదల గండి సమీపంలోని పొదల్లో ఆదివారం ఉదయం అతని మృతదేహం కుళ్ళిన స్థితిలో లభ్యమయింది. దాదాపు పది రోజులుగా కనిపించకుండా పోయిన వంశీ కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతుండగా చివరకు అతని మృతదేహం బయటపడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం జూల వంశీ ఏప్రిల్ 30న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని మొదట బంధువుల ఇళ్లలో స్నేహితుల వద్ద గాలించినా ఆచూకీ లభించకపోవడంతో మూడు నాలుగు రోజుల తర్వాత గోదావరిఖని టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించి వంశి మొబైల్ కాల్ డాటా ఫోన్





లోకేషన్ ఆధారంగా విచారణ చేపట్టారు. పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. వంశీ హైదరాబాద్ కు చెందిన ఓ యువతిని కలవడానికి వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు ఆ యువతీ ఆమె భర్తను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం విచారణలో ప్రేమ వ్యవహారమే హత్యకు దారి తీసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం సింగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఓ యువతీతో వంశీకి గతంలో ప్రేమ వ్యవహారం కొనసాగినట్లు తెలుస్తోంది. కుటుంబ పరిస్థితులు వ్యక్తిగత కారణాలతో ఆ యువతి మరో వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకొని హైదరాబాదులో స్థిరపడినట్లు సమాచారం. దీంతో కొంతకాలంగా ఇద్దరి మధ్య దూరం ఏర్పడింది. అయితే ఇటీవల గ్రామ దేవతల కొలుపు సందర్భంగా ఆ యువతి తిరిగి స్వగ్రామానికి రావడంతో వంశీ తో మళ్లీ పరిచయం పెరిగినట్లు తెలుస్తోంది. ఫోన్ సంభాషణలు కొనసాగడం ఇద్దరి మధ్య మళ్లీ సాన్నిహిత్యం పెరగడంతో యువతి భర్తకు అనుమానం కలిగించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే యువతి ద్వారా వంశిని హైదరాబాదుకు రప్పించి హత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల ముందు నిందితుడు నేరాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం. హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని మంథని సమీపంలోని గాడుదల గండి ప్రాంతానికి తీసుకువచ్చి పడేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. హత్య జరిగిన పది రోజులు కావడంతో మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో లభ్యమైనదని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆధారాల కోసం గాలింపులు చేపట్టారు. వంశీ హత్య విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడిని పథకం ప్రకారమే హత్య చేశారని ఆరోపిస్తూ నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటన దళిత సంఘాల ఆగ్రహానికి దారితీసింది దళిత యువకుడిని దారుణంగా హత్య చేయడం అమానుషమని సంఘాల నాయకులు మండిపడ్డారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు తో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు పలుకోనాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రేమ వ్యవహారం వ్యక్తిగత విభేదాలు పూర్వకక్షలు తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం నివేదిక తదుపరి విచారణంతరం వెలువడే అవకాశం ఉంది. సంఘటన స్థలాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో గోదావరిఖని ఏసిపి మడత రమేష్ అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆయన వెంట గోదావరిఖని సీఐ ప్రసాద్, మంథని ఎస్ఐ రమేష్ ఉన్నారు.

## ప్రజల మధ్య ఉండే నాయకులకే అసలైన గుర్తింపు: బండి రమేష్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** నిరంతరం ప్రజల్లో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడికే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం బేగంపేట డివిజన్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వాలు కల్పించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని, ఆయన రాసిన రాజ్యాంగం వల్లే అందరికీ సమాన హక్కులు లభిస్తున్నాయని కొనియాడారు.దళితరత్న అవార్డులు పొందిన పలువురిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలు అందిస్తున్న డివిజన్ అధ్యక్షుడు రమేష్ కృషిని ఆయన శ్లాఘించారు.ఇదే క్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమేష్ పుట్టినరోజు కావడంతో, బండి రమేష్ ఆయనకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాలి బాలాజీ, శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి దినేష్, గంధము రాజు, కరుణాకర్, సురేష్, పర్వేజ్, అలీ భాయ్, భరత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంథని టెన్నిస్ క్రీడాకారులకు రూ.1.50 లక్షల విలువైన క్రీడా పరికరాల విరాళం





**మంథని, మే 10(వార్త సంధ్య) :** మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలోని లాన్ టెన్నిస్ కోర్టులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోదరుడు దుద్దిళ్ల శ్రీనాథ్, వారి తనయులు దుద్దిళ్ల హర్ష శ్రీపాదరావు, దుద్దిళ్ల ఆర్య శ్రీపాదరావు కలిసి రూ. 1.50 లక్షల విలువైన టెన్నిస్ రాకెట్లు, టెన్నిస్ బాల్స్ మరియు ఇతర క్రీడా పరికరాలను అందజేశారు. పెద్దపల్లి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ సింథటిక్ లాన్ టెన్నిస్ కోర్టు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేయబడింది. అదే కోర్టులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు వారి కుటుంబ సభ్యులు క్రీడా పరికరాలను అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దుద్దిళ్ల శ్రీనాథ్ మాట్లాడుతూ క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. తాను స్వయంగా టెన్నిస్ క్రీడాకారుడినని, టెన్నిస్ ఆటపై ప్రత్యేక అభిరుచి ఉందని తెలిపారు. మంథనిలో ఇలాంటి అత్యాధునిక టెన్నిస్ కోర్టు ఏర్పాటు కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. దుద్దిళ్ల ఆర్య శ్రీపాదరావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే యువత ఫిట్‌నెస్ మరియు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. తమ అమ్మమ్మ సత్యభామ జ్ఞాపకార్థంగా మంథని క్రీడాకారులకు ఈ క్రీడా పరికరాలను అందించడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సురేందర్ రెడ్డి, పోలు శివ, అడ్వకేట్ రమణ కుమార్ రెడ్డి, కొమరోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# డెహ్రాడూన్‌లో ఘోర ప్రమాదం

**అనకాపల్లికి చెందిన ఆర్మీ జవాన్ దుర్మరణం**

**విధి నిర్వహణలో ఆర్మీ నాయక్ రాపేటి పూర్ణచంద్రశేఖర్ కన్నుమూత**

**ప్రమాదంలో నాగాలాండ్‌కు చెందిన మరో సైనికుడు కూడా మరణం**

**నెలన్నర క్రితమే కుటుంబాన్ని డెహ్రాడూన్‌కు మార్చిన పూర్ణచంద్రశేఖర్**

**స్వగ్రామం వెంకుపాలెంలో విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు**




విధి నిర్వహణలో జరిగిన ఘోర ప్రమాదంలో భారత సైన్యానికి చెందిన ఓ తెలుగు జవాన్ ప్రాణాలు కోల్పోయారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం గ్రామానికి చెందిన రాపేటి పూర్ణచంద్రశేఖర్ (37) శుక్రవారం రాత్రి డెహ్రాడూన్‌లో మరణించారు. ఆయన ఆర్మీలో నాయక్‌గా పనిచేస్తున్నారు. ఈ ఘటన ఆయన స్వగ్రామంలో, కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, శుక్రవారం రాత్రి పూర్ణచంద్రశేఖర్ ట్రక్కులో విధులకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక చోట ఆర్చి ఒక్కసారిగా కూలిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో నాగాలాండ్‌కు చెందిన మరో సైనికుడు కూడా మరణించినట్లు సమాచారం. అయితే, ప్రమాదం జరిగిన తీరుపై సైన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.పూర్ణచంద్రశేఖర్‌కు భార్య గ్రేసి, ఐదేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కేవలం నెలన్నర క్రితమే ఆయన తన కుటుంబాన్ని డెహ్రాడూన్‌కు తీసుకెళ్లారు. ఇంతలోనే ఈ విషాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్ చార్జి భీమరశెట్టి రామకృష్ణ వెంకటపాలెంలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ డెహ్రాడూన్ లోని ఆర్మీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. జవాన్ భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వార్త తెలియగానే వెంకుపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఐపీఎస్ భార్య హత్య కేసు.. పనిమనిషి కల్పన కోసం పోలీసుల వేట

**విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం**

**పనిమనిషి కల్పనే ప్రధాన నిందితురాలని పోలీసుల నిర్ధారణ**

**నిందితుల కోసం నేపాల్ సరిహద్దులో గాలింపు**

**పక్కా పథకం ప్రకారమే దోపిడీ, హత్య జరిగిందని అనుమానం**



హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్య తనూజ (60) హత్య కేసులో నిందితుల కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో ఊపిరాడకుండా చేసి ఆమెను హత్య చేసినట్లు పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. ఉన్నతాధికారులు నివసించే ప్రశాసన్‌నగర్‌లో ఇంతటి దారుణం జరగడంతో ఈ కేసును పోలీసులు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు.దర్యాప్తు కోసం పదికి పైగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని విశ్లేషించి కీలక ఆధారాలు సేకరించారు. ప్రధాన నిందితురాలు, ఇంట్లో పనిమనిషిగా చేరిన కల్పన తన సహచరులతో కలిసి ఆటోలో నాంపల్లికి వెళ్లి, అక్కడి నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో నాగ్‌పూర్ వైపు పారిపోయినట్లు గుర్తించారు. అయితే, పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు మార్గమధ్యంలోనే రైలు దిగిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. కొన్ని టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం సాయంత్రానికే నేపాల్ సరిహద్దులకు చేరుకున్నట్లు సమాచారం.ఈ దోపిడీ, హత్య వెనుక పక్కా ప్రణాళిక ఉందని పోలీసులు నిర్ధారించారు. పనిలో చేరడం దగ్గర నుంచి దోపిడీ వరకు బయటి వ్యక్తుల ఆదేశాలతోనే కల్పన నడుచుకుందని భావిస్తున్నారు. ఆమెకు సన్నిహితంగా ఉన్న పలువురు నేపాలీ మహిళలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితులు ముగ్గురా, నలుగురా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనా స్థలంలో లభించిన సెల్‌ఫోన్ల ఆధారంగా కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఫ్లోరిడాలో చార్టర్ బోటులో పేలుడు.. 11 మందికి గాయాలు

**ఫ్లోరిడాలో పేలిన చార్టర్ బోటు.. 11 మందికి గాయాలు**

**మియామిలోని బిస్కేన్ బేలో శనివారం ఘటన**

**గ్యాస్ లీకేజీ వల్లే ప్రమాదం జరిగిందని అనుమానం**

**ఫ్లోరిడా వైల్డ్‌లైఫ్ కమిషన్, కోస్ట్ గార్డ్ విచారణ**



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో ఓ చార్టర్ బోటులో భారీ పేలుడు సంభవించింది. మియామి నగర సమీపంలోని బిస్కేన్ బేలో శనివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక చిన్నారితో సహా 11 మంది గాయపడ్డారు. పర్యాటకులతో ప్రసిద్ధి చెందిన హాలోవర్ సాండ్‌బార్ సమీపంలో ఈ ఘటన జరిగింది."నాటీ నేబర్స్" అనే 40 అడుగుల పడవలో సుమారు 14 మంది ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ధాటికి బోటులో ఉన్న ప్రయాణికులు గాల్లోకి ఎగిరి నీటిలో పడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే మియామి-డేడ్ ఫైర్ రెస్క్యూ, యూఎస్ కోస్ట్ గార్డ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా దీనిని 'లెవెల్ 2 మాస్ క్యాజువాలిటీ'గా ప్రకటించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్రంగా కాలిన గాయాలు కాగా, మరికొందరికి ఇతర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు.బోటు ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో గ్యాస్ లీక్ కావడం వల్లే ఈ పేలుడు జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. బోటు కెప్టెన్ తొందరపడి, భద్రతా నిబంధనల ప్రకారం బ్లోయర్లను ఆన్ చేయకుండానే ఇంజిన్ స్టార్ట్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఒక ప్రత్యక్ష సాక్షి ఆరోపించారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఫ్లోరిడా ఫిష్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ కమిషన్ (ఫ్ఔజ) ప్రధాన దర్యాప్తు సంస్థగా వ్యవహరిస్తుండగా, యూఎస్ కోస్ట్ గార్డ్ కూడా సమాంతరంగా విచారణ జరుపుతోంది. పూర్తి దర్యాప్తు తర్వాతే పేలుడుకు కచ్చితమైన కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు.

# 'మిషన్ దివ్యాస్త్ర' విజయవంతం

**బహుళ లక్ష్యాలను ఛేదించే అగ్ని క్షిపణి పరీక్ష సక్సెస్**

**ఒకేసారి బహుళ లక్ష్యాలను ఛేదించగల అడ్వాన్స్‌డ్ అగ్ని క్షిపణి పరీక్ష విజయవంతం**

**ఒడిశా తీరంలో ప్రయోగం**

**టెక్నాలజీతో పనిచేసే క్షిపణి**

**ఒకేసారి పలు వార్‌హెడ్‌లను మోసుకెళ్లే సత్తా**

**ఈ విజయంతో ఇలాంటి సామర్థ్యం ఉన్న కొద్ది దేశాల సరసన చేరిన భారత్**



భారత రక్షణ రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఒకే క్షిపణితో ఏకకాలంలో బహుళ లక్ష్యాలను ఛేదించగల మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటెడ్ రీ-ఎంట్రీ వెహికల్ టెక్నాలజీతో కూడిన అడ్వాన్స్‌డ్ అగ్ని క్షిపణి ప్రయోగాన్ని భారత్ విజయవంతంగా నిర్వహించింది. ఈ పరీక్షతో దేశ రక్షణ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మే 8న ఈ ప్రయోగాన్ని చేపట్టారు. 'మిషన్ దివ్యాస్త్ర'లో భాగంగా పరీక్షించిన ఈ అగ్ని-5 క్షిపణి, హిందూ మహాసముద్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బహుళ లక్ష్యాలను విజయవంతంగా ఛేదించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. టెక్నాలజీ ద్వారా ఒకే క్షిపణిలో పలు వార్‌హెడ్‌లను అమర్చి, వాటిని వేర్వేరు లక్ష్యాలపైకి ప్రయోగించే వీలుంటుంది. గతేడాది మార్చిలో కూడా భారత్ ఈ టెక్నాలజీతో తొలి పరీక్ష జరిపింది.క్షిపణి ప్రయోగం నుంచి లక్ష్యాలను ఛేదించే వరకు మొత్తం గమనాన్ని భూమి, నౌకల ఆధారిత ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా పర్యవేక్షించారు. నిర్దేశిత లక్ష్యాలన్నీ నెరవేరినట్లు ఫ్లైట్ డేటా ధ్రువీకరించిందని అధికారులు తెలిపారు. ఈ ప్రయోగ సమయంలో డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, భారత సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్డీవో, సైన్యం, పరిశ్రమ భాగస్వాములను అభినందించారు. పెరుగుతున్న ముప్పును ఎదుర్కోవడానికి ఈ సామర్థ్యం దేశానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. అగ్ని-5 క్షిపణి 5,000 కిలోమీటర్ల వరకు లక్ష్యాలను ఛేదించగలదు. ఈ తాజా విజయంతో అత్యాధునిక క్షిపణి టెక్నాలజీ కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.

# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా రన్

**జెండా ఊపి ప్రారంభించిన భువనేశ్వరి**

**తలసేమియాపై అవగాహన కోసం**

**హైదరాబాద్‌లో భారీ రన్**

**జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించిన**

**ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ భువనేశ్వరి**

**దేశంలో ఏటా 12 వేల మంది చిన్నారులు**

**తలసేమియాతో జన్మిస్తున్నారన్న భువనేశ్వరి**

**రక్తదానంపై అపోహలు వీడి ముందుకు**

**రావాలని పిలుపు**



తలసేమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆదివారం హైదరాబాద్‌లో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగరంలోని నెక్లెస్ రోడ్డులో 'తలసేమియా రన్'ను ఘనంగా నిర్వహించింది. జలవిహార్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో 3K, 5K, 10Kవిభాగాల్లో యువత, నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ తలసేమియా వ్యాధి తీవ్రతను వివరించారు. "దేశంలో ఏటా 12 వేల మంది చిన్నారులు తలసేమియాతో జన్మిస్తున్నారు. ఈ వ్యాధి కారణంగా ఎందరో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. బాధితులను కాపాడేందుకు రక్తమార్పిడి ఒక్కటే మార్గం. రక్తదానంపై అపోహలు వీడి ముందుకు రావాలి. యువత తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలను కాపాడవచ్చు" అని ఆమె పిలుపునిచ్చారు.ఈ అవగాహన కార్యక్రమానికి భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ తలసేమియా బాధితులకు ఉచితంగా రక్తం, మందులు అందిస్తోందని భువనేశ్వరి గుర్తుచేశారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కొత్తగా తలసేమియా కేంద్రాలు, బ్లడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె ప్రకటించారు. సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, నగర పౌరులు పాల్గొన్నారు.

## పార్క్‌లో కాలనీ వాసులతో కలిసి పర్యాటించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 10:** హస్తినాపురం డివిజన్ పరిధిలోని హుడా భారతి నగర్ పార్క్‌లో కాలనీ వాసులతో కలిసి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటికే పార్క్‌కు కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు వాచ్‌మన్ రూమ్ మరియు మూత్రశాలల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా హార్టికల్చర్ అధికారులతో మాట్లాడి పార్క్‌ను సరికొత్త హంగులతో, ఆధునిక సౌకర్యాలతో అద్భుతంగా అభివృద్ధి చేయాలని కోరినట్లు వెల్లడించారు. అతి త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అభివృద్ధి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పార్క్ అభివృద్ధితో కాలనీ వాసులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, కాలనీ అధ్యక్షులు పి.వి. మనాలన్, సెక్రటరీ చల్లా శశిపాల్ రెడ్డి, బొల్లంపల్లి రాజేష్, నరేష్, నర్సింగ్ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని బాలుడు హయత్‌నగర్ పోలీసులకు లభ్యం



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, మే 10:** ఆదివారం ఉదయం సుమారు 09:00 గంటల సమయంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సుమారు 12 సంవత్సరాల వయస్సు గల మల్లేష్ అనే బాలుడు సంచరిస్తూ కనిపించాడు. బాలుడిని విచారించగా తన ఇంటి చిరునామా గాని, తల్లిదండ్రుల వివరాలు గాని చెప్పలేకపోతున్నాడు. బాలుడి భద్రత మరియు సంరక్షణ నిమిత్తం అతడిని సైదాబాద్, హైదరాబాద్‌లోని బాలుర బాలల గృహానికి తరలిం చడమైనది.ఈ బాలుడి గురించి లేదా అతని కుటుంబ సభ్యుల గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే వెంటనే హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించగలరు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్: 8712662640

## విజయ్ ప్రమాణ స్వీకారానికి హాజరైన నటి త్రిష

**నెహ్రూ ఇండోర్ స్టేడియంలో విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం**

**వేడుకలో మెరిసిన త్రిష**

**తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు**

టీవీకే పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సినీ నటి త్రిష హాజరయ్యారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి, ఇప్పటికే విజయ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. ఈ వేడుకలో త్రిష మెరిశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్ర నాయకుడు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు.

## యూఎఫ్‌వోల గుట్టువిప్పిన పెంటగాన్

**160 రహస్య ఫైళ్లు విడుదల!**

**గ్రహాంతరవాసుల ఉనికిని ఈ ఫైళ్లు ధ్రువీకరించడం లేదని స్పష్టత**

**దశాబ్దాల నాటి వ్యోమగాములు, సైనికుల నివేదికలు బహిర్గతం**

**భారత్‌లోని ఇంఫాల్ ఎయిర్‌పోర్టులో యూఎఫ్‌వో కలకలం వంటి ఘటనలు వెలుగులోకి**

**సెన్సార్ల లోపాలు, వాతావరణ మార్పులే కారణమని చెబుతున్న నివేదికలు**

గ్రహాంతరవాసులు (ఏలియన్స్), గుర్తుతెలియని ఎగిరే వస్తువుల (యూఎఫ్‌వో) ఉనికిపై దశాబ్దాలుగా కొనసాగుతున్న చర్చను అమెరికా రక్షణ ప్రధాన కార్యాలయం పెంటగాన్ మరోసారి తెరపైకి తెచ్చింది. యూఎఫ్‌వోలపై గతంలో అత్యంత రహస్యంగా వర్గీకరించిన 160కి పైగా ఫైళ్లను తాజాగా విడుదల చేసింది. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు ఈ ఫైళ్లను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది.1940ల నుంచి ఇప్పటివరకు సేకరించిన సమాచారంతో ఈ ఫైళ్లను రూపొందించారు. ఇందులో సైనిక సిబ్బంది చిత్రీకరించిన ఇన్‌ఫ్రారెడ్ వీడియోలు, రాడార్ చిత్రాలు, ఎఫ్‌బీఐ మెమోలు, నాసా వ్యోమగాముల నివేదికలు ఉన్నాయి. అత్యంత వేగంతో కదులుతూ దిశలు మార్చుకుంటున్న ప్రకాశవంతమైన గోళాలు, సిగరెట్, డిస్క్ ఆకారంలో ఉన్న వస్తువులను చూసినట్లు ఈ ఫైల్స్‌లో పేర్కొన్నారు. 1969లో చంద్రుడి సమీపంలో ఓ కాంతిపుంజాన్ని చూసినట్లు అపోలో 11 వ్యోమగామి బజ్ ఆల్డ్రిన్ చెప్పిన వివరాలు కూడా ఇందులో ఉన్నాయి.అయితే, ఈ ఫైళ్లు ఏవీ కూడా గ్రహాంతరవాసుల ఉనికిని ధ్రువీకరించడం లేదని పెంటగాన్ అధికారులు స్పష్టం చేశారు. చాలా సందర్భాల్లో సెన్సార్లలో సాంకేతిక లోపాలు, వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా కొన్ని వస్తువులను యూఎఫ్‌వోలుగా భ్రమపడే అవకాశం ఉందని 2024 నివేదికలో పేర్కొన్నారు.మరోవైపు, భారత్‌లోనూ యూఎఫ్‌వోల ప్రస్తావన ఉంది. 2023లో ఇంఫాల్ విమానాశ్రయం గగనతలంలో ఓ గుర్తుతెలియని వస్తువు కనిపించడంతో, దాన్ని అడ్డుకునేందుకు వాయుసేన రెండు రఫేల్ యుద్ధ విమానాలను పంపింది. అయితే, అది కాసేపటికే కనుమరుగైంది. భారత్-చైనా సరిహద్దులోని కోంగ్కా లా పాస్‌ను స్థానికులు యూఎఫ్‌వో బేస్‌గా భావిస్తుంటారు. అమెరికా తన డేటాను విడుదల చేసిన నేపథ్యంలో, ఏలియన్లపై నెలకొన్న ఆసక్తి కారణంగా ఇతర దేశాలు కూడా ఇలాంటి సమాచారాన్ని భద్రపరచాలని ఆలోచిస్తున్నాయి.



## బిడ్డను గుండెలకు హత్తుకుని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ పోస్టు.. స్పందించిన ఇరాన్

**ఇటీవల పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్**

## బట్టలు గ్యాస్ స్టౌపై మరకలు సులువుగా వదలట్లేదా చిటికెలో మాయం చేసే చిట్కా ఇదిగో



వంట చేసేటప్పుడు, ఇతర పనులు చేసేటప్పుడు వంటగది మురికిగా మారడం షరా మామూలే. ముఖ్యంగా వంటగదిలోని గ్యాస్ స్టవ్ మురికిగా మారడం, బట్టలపై నూనె, ఇతర ఆహార మరకలు కనిపించడం సర్వసాధారణం. అయితే వీటిని డిటర్జెంట్‌తో ఎంత రుద్దినా ఒక్కోసారి మరకలు ఓ పట్టాన వదలవు. దీంతో గృహిణులు ప్రతిసారి.. మీరు ఎంత శుభ్రంగా ఉంచినా, వంట చేసేటప్పుడు, ఇతర పనులు చేసేటప్పుడు వంటగది మురికిగా మారడం షరా మామూలే. ముఖ్యంగా వంటగదిలోని గ్యాస్ స్టవ్ మురికిగా మారడం, బట్టలపై నూనె, ఇతర ఆహార మరకలు కనిపించడం సర్వసాధారణం. అయితే వీటిని డిటర్జెంట్‌తో ఎంత రుద్దినా ఒక్కోసారి మరకలు ఓ పట్టాన వదలవు. దీంతో గృహిణులు ప్రతిసారి వంట చేసిన తర్వాత గ్యాస్ స్టవ్‌పై పేరుగు పోయిన మురికి ఎంత శుభ్రం చేసినా వదలడం లేదని తెగ హైరానా పడిపోతుంటారు. అయితే ఈ కింది చిట్కాలను అనుసరించడం ద్వారా మరకలను సులభంగా తొలగించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఎలాగంటే..న్స్ నుంచి మరకలు, గ్యాస్ స్టవ్‌ల నుంచి మురికి, ఇస్త్రీ బోర్డుల నుంచి మరకలను సులభంగా ఎలా తొలగించాలో చిట్కాలను అందించే ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియోలో మరకలు వదిలించే సింపుల్ చిట్కాలు చూసేయండి. జీన్స్ మీద మరకలు ఉంటే, వాటిని స్క్రబ్ చేయడానికి డిటర్జెంట్ ఉపయోగించే బదులు, మరకలు ఉన్న ప్రదేశంలో కొద్దిగా బేకింగ్ సోడాను అప్లై చేసి, పైన సాదా కాగితాన్ని ఉంచి, ఇస్త్రీ బోర్డుతో కొద్దిగా వేడి చేయడం ద్వారా మరకను సులభంగా తొలగించవచ్చు. గ్యాస్ స్టవ్ మీద గ్రీజు లేదా ఇతర మురికి ఉంటే, దానిపై సబ్బు నీరు పోసి, స్క్రబ్బర్ తో సున్నితంగా రుద్దడం ద్వారా మురికిని తొలగించవచ్చు. ఇస్త్రీ చేసేటప్పుడు ఫాబ్రిక్ రంగు ఇస్త్రీ బోర్డుకు అంటుకుంటే, ఇస్త్రీ బోర్డును కొద్దిగా వేడి చేసి, మరకపై ఆస్ప్రిన్ టాబ్లెట్‌ను రుద్దడం ద్వారా మరకను సులభంగా తొలగించవచ్చు. ఈ చిట్కాలను అనుసరించడం ద్వారా మరకలు, ధూళిని సులభంగా తొలగించవచ్చు.

## తల్లికి ప్రేమను చాటే అద్భుత బహుమతులు మదర్స్ డేకుబెస్ట్ గిఫ్ట్ ఐడియాలు ఇవే



ఈ ప్రపంచంలో తల్లి ప్రేమకు మించింది మనిషికి ఏదీ లేదు. ఏ తల్లి అయినా తన బిడ్డ భవిష్యత్ బాగా ఉండాలని కోరుకుంటుంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో మదర్స్ డే జరగనుంది. ఈ మదర్స్ డే రోజున తమ తల్లులకు మరుపురాని బహుమతులు ఇవ్వాలని చాలా మంది అనుకుంటారు. ఈ నేపథ్యంలో మదర్స్ డే రోజు తల్లులకు గిఫ్ట్ ఇవ్వడానికి బెస్ట్ గిఫ్ట్ ఐడియాల గురించి ఓ సారి తెలుసుకుందాం. అమెరికా, భారతదేశం, కెనడా, యూరప్‌లోని ఎక్కువ భాగంతో సహా అనేక దేశాల్లో మే 11, 2025 ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం మే నెలలో రెండో ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈ రోజును పురస్కరించుకుని పిల్లలకు తమ తల్లులకు మంచి బహుమతులు ఇస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు బడ్జెట్ ఫ్రెండ్లీ బహుమతులతోనే అమ్మను సంతోష పెట్టే బహుమతుల కోసం ఎక్కువగా ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ది బెస్ట్ 5 గిఫ్ట్ ఐడియాలపై ఓ లుక్కేద్దాం.

**డిజిటల్ ఫోటో ఫ్రేమ్**

మనకు తల్లితో ఉన్న అనుబంధాన్ని ఇప్పటికే చాలా వరకు ఫొటోల్లో నిక్షిప్తం చేసుకుంటూ ఉంటాం. ఈ అన్ని ఫొటోలను కలిపి డిజిటల్ ఫ్రేమ్‌గా లేదా షేర్డ్ ఆన్‌లైన్ ఆల్బమ్‌గా తయారు చేయండి. భౌతిక ఫోటోల మాదిరిగా కాకుండా ఈ ఆన్‌లైన్ ఆల్బమ్ ఆమెతో గడిపిన సంతోష సమయాన్ని గుర్తు చేస్తూంటుంది.

**పూలుజి**

మీరు మీ తల్లికి దూరంగా ఉంటే ఆమె ఉండే ప్రాంతానికి సమీపంలోని పూల వ్యాపారులు లేదా ఆన్‌లైన్ సేవల ద్వారా అదే రోజు డెలివరీ అయ్యేలా ఆమెకు ఇష్టమైన పూలతో బొకే పంపితే సర్ప్రైజింగ్ గిఫ్ట్‌లా ఉంటుంది. ఇండోర్ ప్లాంట్ లేదా ఆమెకు ఇష్టమైన రంగు పూలను ఇవ్వడం ద్వారా సంతోషపెట్టవచ్చు.

**ఈ-కార్ట్ గిఫ్ట్**

ఆమెకు ఇష్టమైన వస్తువులను అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సైట్స్‌లో ఆర్డర్ చేసి వాటితో పాటు ఈ-గిఫ్ట్ కార్డుతో ఆమె శుభాకాంక్షలు తెలపవచ్చు. లేదా ఆమె ఇష్టమైన భోజన డెలివరీ లేదా దుస్తుల యాప్ కోసం వోచర్‌లను వెంటనే ఈ-మెయిల్ చేయడం ద్వారా ఆమెకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకునేలా చేయవచ్చు.

**వీడియో మెసేజ్**

మీ తల్లి మీకు ఎంత స్పెషల్? ఆవిడంటే మీకు ఎంత ఇష్టం అనే విషయాలను చెబుతూ ఓ లెటర్ రాసి ఆమెకు ఇవ్వడంతో పాటు వీడియో సందేశాన్ని ఆమెకు చూపండి. ఎందుకుంటే గిఫ్ట్ షాప్స్‌లో దొరికే లెటర్స్ కంటే స్వ దస్తూరితో రాసిన లెటర్‌ను ఆమెకు అపూరమైనదిగా ఉంటుంది.

**తల్లితో సమయం గడపడం**

మదర్స్ డే రోజు మొత్తం మీ సమయాన్ని మొత్తం ఆమెకే కేటాయించండి. అది ఆమెకు మరుపురాని బహుమతిగా ఉంటుంది. ఆమెతో కలిసి సినిమా చూడటం, వాకింగ్‌కు వెళ్లడం లేదా టీ లేదా కాఫీ తాగుతూ సమయం గడపాలి. ఆమెను పని చేయనివ్వకుండా ఆ రోజు పని మొత్తం మీరే చేయడానికి ప్రయత్నించడం ఉత్తమం

## పగలా రాత్రా ఏ టైంలో స్నానం చేస్తే ఆరోగ్యానికి మేల



మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. కానీ చైనా, జపాన్, కొరియా వంటి దేశాల్లో.. ప్రతి ఒక్కరికీ ప్రతిరోజూ స్నానం చేసే అలవాటు ఉంటుంది. మంచి ఆరోగ్యానికి స్నానం చాలా అవసరం. స్నానం శరీరాన్ని శుభ్రపరచడమే కాకుండా మనసును కూడా ప్రశాంతపరుస్తుంది. కానీ చాలా మంది ఉదయం స్నానం చేస్తారు. మరి కొంతమంది రాత్రిపూట స్నానం చేస్తారు. భారతీయులుగా మనం ఎక్కువగా ఉదయం స్నానం చేయడానికి ఇష్టపడతాం. కానీ చైనా, జపాన్, కొరియా వంటి దేశాల్లో రాత్రిపూట స్నానాలు చేసే అలవాటు ఉంది. కానీ ఈ రెండింటిలో ఏది మంచిదో మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

**రాత్రిపూట స్నానం చేయడం మంచిదా?**

సాధారణంగా చాలా మంది సాయంత్రం లేదా రాత్రి పూట స్నానం చేస్తారు. ఇలా చేయడం వల్ల రోజులో శరీరంపై పేరుకుపోయిన టాక్సిన్స్, మురికి పూర్తిగా తొలగిపోతాయి. అలాగే, వారికి రాత్రిపూట విశ్రాంతి అవసరం కాబట్టి, బాగా నిద్రపోవడానికి ఇలా చేస్తారు. దీనివల్ల ఒత్తిడి తగ్గుతుందని చాలా మంది నమ్ముతారు. ముఖ్యంగా చైనా వంటి దేశం.. తేమతో కూడిన, ఉష్ణమండల ప్రాంతం. కాబట్టి ఇక్కడి ప్రజలకు ఎక్కువగా చెమట పడుతుంది. అందుకే వారు రాత్రిపూట స్నానాలు చేయడానికి ఇష్టపడతారు. రాత్రిపూట స్నానం చేయడం మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు. రోజంతా కష్టపడి పనిచేసిన తర్వాత స్నానం చేయడం వల్ల అలసట తగ్గి బాగా నిద్రపోతుందట.

## ఆరోగ్యానికి అసలైన నియమాలు ఎప్పుడు ఎలా తింటే మంచిదో తెలుసా




పతాంజలిని స్థాపించిన యోగా గురువు బాబా రామ్‌దేవ్ బాబా. ఆచార్య బాలకృష్ణ ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రజలకు అవసరమైన ఆయుర్వేద సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి సహాయపడే ఆహారానికి సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన విషయాలను వివరించారు. ఆయుర్వేదం ప్రకారం సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో తెలియజేశారు. ఆ వివరాల్లోకి వెళితే... ఆహారం, ఆరోగ్యం ఒకదానికొకటి ప్రత్యక్షంగా దగ్గరి సంబంధం కలిగి ఉంటాయి. మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ఆహారంలో పోషకాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవడం మాత్రమే కాదు..ఆహారానికి సంబంధించిన కొన్ని నియమాలను పాటించడం కూడా తప్పనిసరి అంటున్నారు.. పతాంజలిని స్థాపించిన యోగా గురువు బాబా రామ్‌దేవ్ బాబా. ఆచార్య బాలకృష్ణ ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రజలకు అవసరమైన ఆయుర్వేద సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. ఇందులో భాగంగానే మీరు ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటానికి సహాయపడే ఆహారానికి సంబంధించిన కొన్ని ప్రత్యేకమైన విషయాలను వివరించారు. ఆయుర్వేదం ప్రకారం సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో తెలియజేశారు. ఆ వివరాల్లోకి వెళితే ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో అందరికీ తెలుసు. ఆయుర్వేదం ప్రకారం ఆహారం నాణ్యత సరిగ్గా ఉండటంతో పాటు, దాని పరిమాణం, మీరు తినే పరిస్థితులు కూడా మీ ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయంటున్నారు

పతంజలి వ్యవస్థాపకుడు రామ్‌దేవ్, బాల్కృష్ణ. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండటం విషయానికి వస్తే, గుండె జబ్బులు, ఊబకాయం మొదలైన వాటికి భయపడి ప్రజలు నెయ్యి, నూనెతో చేసిన వాటిని తినడం మానేస్తారు. అయితే ఆయుర్వేదం మన ఆహారంలో తగినంత నెయ్యి, నూనె ఉండాలని చెబుతుంది. నూనె, నెయ్యి ఆహార రుచిని పెంచడమే కాకుండా, ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయని చెబుతున్నారు. మన శరీరం సరిగ్గా పని చేయాలంటే కొవ్వు కచ్చితంగా అవసరం అంటున్నారు. ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు ఏ,డీ,ఈ, కే లను శరీరం గ్రహించేలా చేస్తాయి. ఇవి హార్మోన్ల ఉత్పత్తికి చాలా అవసరం. ఇవన్నీ మన చర్మాన్ని, మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయని చెబుతున్నారు. ఆచార్య బాలకృష్ణ చెప్పిన వివరాల ప్రకారం.. ఎప్పుడూ తాజాగా తయారుచేసిన, వేడి ఆహారాన్ని మాత్రమే తినాలని చెబుతున్నారు. ఇటువంటి ఆహారం రుచికరంగా ఉండటమే కాకుండా పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. అలాంటి ఆహారం సులభంగా జీర్ణం అవుతుందని అంటున్నారు. నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడి చేసి అస్సలు తినకూడదని అంటున్నారు. ఆహారం రుచి మాత్రమే కాదు, దాని రంగు, వాసన, వడ్డించే విధానం కూడా జీర్ణ రసాలను ప్రేరేపిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. అలాగే, భోజనం చేసేప్పుడు మీ చుట్టూ ఉన్న పర్యావరణం కూడా అంలే అనుకూలంగా ఉండాలని చెబుతున్నారు. ఆహారాన్ని బాగా వడ్డించడం ఎంత ముఖ్యమో, మీరు కూర్చుని తినే వాతావరణం ఆహ్లాదకరంగా, ప్రశాంతంగా ఉండటం కూడా అంతే ముఖ్యం. అంటున్నారు. ఇందులో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైనది అంటున్నారు. ఇతరులతో కలిసి భోజనం చేయడానికి ప్రయత్నించాలని ఆయుర్వేదం చెబుతుంది. ఆహారాన్ని ఎల్లప్పుడూ ఏకాగ్రతతో తినాలి. భోజనం చేసేటప్పుడు వేరే దేనిపైనా దృష్టి పెట్టకండి. సింధూర్ నుండి బాలాకోట్ వరకు..భారత్ సత్తాను నిరూపించిన ఆపరేషన్స్ ఇకపోతే, ఆహారం తినే విధానానికి సంబంధించిన నియమాల గురించి మాట్లాడుకుంటే, ఆయుర్వేదం ప్రకారం, కాళ్లకు చెప్పులు, బూట్లు ధరించి ఎప్పుడూ తినకూడదు. ఆహారాన్ని గౌరవించడం మాత్రమే కాదు, పాదరక్షలు ధరించడం వల్ల పాదాల నుండి వేడి ఉత్పత్తి అవుతుంది. దీంతో జీర్ణక్రియ నెమ్మదిస్తుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యం. చేతులు, కాళ్ళు కడుక్కుని, తుడుచుకున్న తర్వాతే ఆహారం తీసుకోవాలి. ముందుగా ప్రకృతికి ప్రార్థన చేసి కృతజ్ఞతలు తెలియజేయాలి. తినడానికి ముందు, 2-3 సిప్స్ నీరు త్రాగండి. ఇది గొంతు మార్గాన్ని క్లియర్ చేస్తుంది. మీరు ఆహారాన్ని మరింత సులభంగా తినగలుగుతారు. ఆహారాన్ని చేతులతో తినాలి. ఇది ఆహారం పట్ల ఆసక్తిని పెంచుతుంది. అప్పుడే మీరు వేడి, చలిని ఆస్వాదిస్తారు. నేలపై సౌకర్యవంతమైన స్థితిలో కూర్చుని మాత్రమే భోజనం చేయాలని చెబుతున్నారు. కానీ, నిలబడి, నడుస్తూ తినడం సరైనది కాదని అంటున్నారు. అలాగే, తినేటప్పుడు సంతోషంగా ఉండటం కూడా ముఖ్యం. ప్రతికూల భావోద్వేగాలు జీర్ణక్రియపై చెడు ప్రభావాన్ని చూపుతాయని అంటున్నారు.. ఇది జీర్ణ రసాల స్రావాన్ని అడ్డుకుంటుందని చెబుతున్నారు. దీంతో అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. అంతేకాదు.. మీరు ఎలాంటి వ్యాధులు లేని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలనుకుంటే సమయానికి ఆహారం తీసుకోవడం ఉత్తమమని ఆయుర్వేదం చెబుతోంది. ఆహారం సరిగ్గా జీర్ణం కావడానికి సరైన సమయంలో క్రమం తప్పకుండా తినండి. దీనితో పాటు, గుర్తుంచుకోవలసిన మరికొన్ని విషయాలు కూడా ఉన్నాయి. మొదటిసారి తిన్న ఆహారం పూర్తిగా జీర్ణమైనప్పుడు, అంటే మీకు సరిగ్గా ఆకలిగా అనిపించడం ప్రారంభించినప్పుడు, అప్పుడు మాత్రమే ఆహారం తినండి. లేకపోతే, కడుపులో ఇప్పటికే ఉన్న జీర్ణం కాని రసం తాజా ఆహారంతో కలిసిపోతుంది. ఇది శరీర దోషాలను మరింత దిగజార్చి, మీ శరీరాన్ని వ్యాధులకు గురి చేస్తుంది. అందుకే మధ్యాహ్న భోజనం 12 నుండి 2 గంటల మధ్య తీసుకోవాలి. ఇది శరీరానికి బలాన్ని ఇస్తుంది. ఆహారం కూడా సరిగ్గా జీర్ణమవుతుంది. దీని కారణంగా అన్ని పోషకాలు లభిస్తాయి. ఆహారం నుండి శరీరానికి సరైన పోషకాలు అందేలా చూసుకోవడానికి, మీరు సరైన పరిమాణంలో తినడం ముఖ్యం. దీని కోసం, తినేటప్పుడు మీ కడుపులో మూడింట ఒక వంతు లేదా నాలుగో వంతు ఖాళీగా ఉండేలా చూసుకోవాలి. ఇది ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది. వాత కదలికను కూడా నియంత్రిస్తుందని పతంజలి వ్యవస్థాపకుడు ఆచార్య బాలకృష్ణ అంటున్నారు. వీటిని మీ రోజువారీ జీవితంలో అలవాటు చేసుకుంటే మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవచ్చునని చెబుతున్నారు.

## సింధూరం స్వచ్ఛమైనదో నకిలీదో గుర్తించేదెలా అసలు ఎలా తయారు చేస్తారంటే









కాదేదీ కల్తీకి అనర్హం అన్న సామెతను సార్ధకం చేస్తూ దేశంలో అనేక వస్తువులు, నిత్యవసర వస్తువులు, తినే ఆహారం అన్నింటిలోనూ కల్తీకి తెగబడుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాలు, పెరుగు, జున్ను, పండ్లు, కూరగాయలు, ఉప్పు, పప్పు, వంటనూనెలు ఇలా ఒక్కటేమిటీ.. ఈ కలికాలంలో ప్రతిదీ కల్తీమయమే. అరటి, మామిడి, బొప్పాయి వంటి పండ్లు, తియ్యటి చక్కెరలో కెమికల్స్, బెల్లం రంగు, రుచి రావడం కోసం కూడా రసాయనాలు వాడుతున్నారు. చివరకు ఆడవాళ్లు నుదుటన ధరించే సింధూరంలోనూ కల్తీ ఉంటుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మార్కెట్లో నకిలీ సిందూరం దొరుకుతుండటంతో మహిళలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అసలు, నకిలీ సిందూరాలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి.

**1 / 5**

ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే. ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే.

**2 / 5**

ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు. ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు.


**3 / 5**

అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది. అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది.

**4 / 5**

సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు. సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు.

## ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే మీ లైఫ్‌లో సరికొత్త చాప్టర్ మొదలైనట్లే



చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. కాబట్టి ఉదయం నిద్రలేచిన తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది.

**విషాన్ని తొలగిస్తుంది**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది.

**ఏపీ పీజీసెట్ 2025 దరఖాస్తు గడువు పెరిగిందోచ్..**

ఎప్పటి వరకంటే?

**జీవక్రియను పెంచుతుంది**

మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**చర్మ కాంతి పెరుగుతుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

**గమనిక:**

ఈ కంటెంట్ సాధారణ సమాచారం కోసం మాత్రమే. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

# చేస్తున్నారా "డిజిటల్ పేమెంట్స్"

**హిడెన్ ఛార్జీలు గమనించకపోతే మోసపోతారు!**

**పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు**

**ఈ జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టపోవడం**

**గ్యారెంటీ అంటున్న నిపుణులు!**



నేటి టెక్నాలజీ యుగంలో రోజు రోజుకి డిజిటల్ చెల్లింపుల వాడకం బాగా పెరిగిపోతుంది. డిజిటల్ విప్లవం పుణ్యమా అని బ్యాంకింగ్ సేవలు మన అరచేతిలోకి వచ్చేశాయి. ముఖ్యంగా యూపీఐ వాడకం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరిగే పని లేకుండా ఇంటర్నెట్ ఉంటే చాలు చిటికెలో మొబైల్ నుంచి చెల్లింపులు చేసేస్తున్నారు. చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు బిల్లు కట్టడం కోసం ఆన్‌లైన్ చెల్లింపు విధానానికే మొగ్గు చూపుతున్నారు మెజార్టీ పీపుల్. ఆన్‌లైన్ చెల్లింపు విధానాలు ప్రజలకు అనేక విధాలుగా మేలు చేస్తున్నాయి. ప్రధానంగా జనాలకు చిల్లర సమస్య తీరిపోయింది. నగదు కోసం ఏటీఎంల వద్ద వరుసల్లో నిల్చునే పరిస్థితులు తగ్గిపోయాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఏదైనా యూపీఐ యాప్ ద్వారా మీ అవసరానికి క్షణాల్లోనే మనీ ట్రాన్సక్షన్ చేసుకోవచ్చు. అదే స్థాయిలో యాప్‌లలో వినియోగదారులను మోసగించే విధానాలూ పెరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ పేమెంట్ వేదికల్లో మోసపూరిత విధానాల పట్ల ప్రభుత్వం కఠిన చర్యలు, నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ అవి ఏమాత్రం తగ్గడం లేదు. మాయమాటలు, గందరగోళపరిచే డిజైన్లతో దాచిన ఛార్జీల భారాన్ని మోపుతూ వినియోగదారులను మోసగిస్తున్న తీరు జనాలను ఆందోళనకు గురిచేస్తోందంటున్నారు నిపుణులు. మీరూ ఆన్‌లైన్ పేమెంట్స్ ఎక్కువగా చేస్తున్నట్లయితే ఇలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అసలు, హిడెన్ ఛార్జీలు ఏవిధంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి? వాటి నుంచి రక్షణ పొందాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఆన్‌లైన్ చెల్లింపులు చేసేవారిలో ఎక్కువ మంది అదృశ్య ఛార్జీలు బారిన పడుతున్నారు. పెద్ద నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకూ అందరినీ ఈ ఛార్జీల సమస్య వేధిస్తోందంటున్నారు నిపుణులు. మనీ పే చేయడానికి ముందు ఆకర్షణీయమైన నగదు వెనక్కి లేదా ఇతర బెనిఫిట్స్ లభిస్తాయని జనాలను ఆకర్షిస్తుంటారు. తీరా ట్రాన్సక్షన్ కంప్లీట్ అయ్యాక వాటిని అమలు చేయకుండా మోసగిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. యూపీఐ ద్వారా బ్యాంకు అకౌంట్ ఒకసారి యాప్‌నకు యాడ్ చేసిన తర్వాత, దాన్ని డీలింక్(తొలగించడం) చేయడం కత్తిమీద సాములాగా మారుతుందంటున్నారు. దాదాపు 68 శాతం మంది వినియోగదారులు ఇందులో చిక్కుకుపోతున్నారని సూచిస్తున్నారు. యాప్ డిజైన్‌ను ఉద్దేశపూర్వకంగా గందరగోళంగా మార్చి, వినియోగదారులు తాము కొనకూడదనుకున్న సేవలు లేదా ప్రొడక్ట్స్ వైపు వారిని మళ్లేలా చేస్తున్నారంటున్నారు. ఇవి మాత్రమే కాకుండా కొన్నిసార్లు మనకు ట్రాన్సక్షన్స్‌లో ఏమాత్రం తెలియకుండానే బీమా, విరాళాలు, లేదా టిప్స్ వంటి అదనపు ఛార్జీలు బిల్లుకు యాడ్ అవుతుంటాయి. వీటిని చూసుకోకపోతే మోసపోయినట్లేనని హెచ్చరిస్తున్నారు నిపుణులు. యాప్‌లోని సేవలు వాడుకోవాలంటే కచ్చితంగా మొబైల్‌లో ఉన్న నంబర్లన్నింటినీ పంచుకోవాలని ఒత్తిడి చేయడం, వాలెట్లలోని డబ్బులను నిలిపివేయడం వంటి ఇబ్బందులు చాలా మందికి ఎదురవుతుంటాయని చెబుతున్నారు.

**ఈ సీక్రెట్ ట్రిక్‌తో "హోమ్ లోన్" చెల్లించండి**
**రూ.50 లక్షలపై రూ.20 లక్షలు ఆదా!**
**అదనపు ఛార్జీల నుంచి రక్షణ ఎలా పొందాలంటే?**

ఆన్‌లైన్ చెల్లింపుల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అదనపు ఛార్జీల భారం నుంచి తప్పించుకోవచ్చంటున్నారు నిపుణులు. అలాంటి వాటిల్లో కొన్నింటిని ఇప్పుడు చూద్దాం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) తాజాగా ఈ-మాండేట్ నిబంధనలను అప్‌డేట్ చేసింది. మారిన రూల్స్ ప్రకారం.. మీరు నెలవారీ చెల్లింపులను (రికరింగ్ పేమెంట్స్) ఎప్పుడైనా నిలిపివేయడం, రద్దు చేసుకునే పూర్తి హక్కును కలిగి ఉంటారంటున్నారు నిపుణులు. మీ అకౌంట్ నుంచి డబ్బులు డెబిట్ అయ్యే ముందు కచ్చితంగా ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లను ఒకటికి రెండు సార్లు గమనించాలి. కొత్త నిబంధనల ప్రకారం, వినియోగదారుల కన్ఫర్మేషన్(ధ్రువీకరణ) లేకుండా డబ్బులు డెబిట్ చేసేందుకు వీల్లేదు. ఇది ఆఫర్ల పేరుతో జరిగే మోసాలను అరికట్టేందుకు చాలా బాగా ఉపయోగపడుతుందంటున్నారు. అలాగే, మీరు ఏదైనా బిల్లు కట్టేటప్పుడు అందులో మీకు తెలియకుండానే బీమా, విరాళాలు, ఇతర అదనపు ఛార్జీలు ఏమైనా కలుస్తున్నాయా అని ముందే ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. అన్నీ చెక్ చేసుకున్నాకే పేమెంట్ చేయడం మంచిదంటున్నారు. ఇప్పటికే సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ డిజిటల్ చెల్లింపుల వేదికల్లో ఉన్న 13 రకాల రుసుములు, ఇతర మోసాలను గుర్తించి, నిషేధం విధించింది. కాబట్టి, యాప్‌లు మిమ్మల్ని మోసగించినా, బలవంతపు రుసుములు విధించినా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని సూచిస్తున్నారు నిపుణులు.

# ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ భారీ ఊరట

**పాకిస్థాన్‌కు 1.3 బిలియన్ డాలర్ల నిధులు విడుదల చేసిన ఐఎంఎఫ్**

**కార్యక్రమాల సమీక్ష పూర్తి కావడంతో నిధుల మంజూరుకు ఆమోదం**

**పాక్ ఆర్థిక పనితీరు మెరుగ్గా ఉందని ఐఎంఎఫ్ ప్రశంస**

**అయినప్పటికీ ద్రవ్యోల్బణం, బాహ్య సవాళ్లు ఉన్నాయని హెచ్చరిక**

**ఆర్థిక సంస్కరణలు కొనసాగించాలని పాకిస్థాన్‌కు సూచన**




తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి భారీ ఊరట లభించింది. కీలక కార్యక్రమాల సమీక్షలను పూర్తి చేసిన అనంతరం సుమారు 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 12,275 కోట్లు) నిధులను విడుదల చేసేందుకు ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఆమోదం తెలిపింది. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఈఎఫ్ఎఫ్) కింద మూడో సమీక్ష, రెసిలెన్స్ అండ్ సస్టెయినబిలిటీ ఫెసిలిటీ (ఆర్ఎస్ఎఫ్) కింద రెండో సమీక్షలను పూర్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా తక్షణమే ఈఎఫ్ఎఫ్ కింద 1.1 బిలియన్ డాలర్లు, ఆర్ఎస్ఎఫ్ కింద 220 మిలియన్ డాలర్లు పాకిస్థాన్‌కు అందనున్నాయి. దీంతో ఈ రెండు కార్యక్రమాల కింద పాక్‌కు ఇప్పటివరకు అందిన మొత్తం నిధులు 4.8 బిలియన్ డాలర్లకు చేరాయి. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ, పాకిస్థాన్ కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేస్తోందని ఐఎంఎఫ్ ప్రశంసించింది. దీనివల్ల ఆర్థిక స్థిరత్వం కొనసాగుతోందని, బాహ్య ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని పేర్కొంది. ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ నైజెల్ క్లార్క్ మాట్లాడుతూ.. "పాకిస్థాన్ ఆర్థిక పనితీరు బలంగా ఉంది. విదేశీ మారక నిల్వలు 2025 జూన్‌లో 14.5 బిలియన్ డాలర్లు ఉండగా, డిసెంబర్ నాటికి 16 బిలియన్ డాలర్లకు పెరిగాయి" అని తెలిపారు. అయితే, అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు పెరగడంతో దేశీయంగా ఇంధన ధరలు పెరిగి ద్రవ్యోల్బణం ఒకింత పెరిగిందని, బాహ్యంగా సవాళ్లు ఉన్నాయని హెచ్చరించారు. ఆర్థిక క్రమశిక్షణ కొనసాగించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అవినీతి నిరోధక చర్యలు వంటి లోతైన నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టాలని ఐఎంఎఫ్ నొక్కి చెప్పింది.

# బ్యాంకుల నుంచి "రుణాలు" తీసుకున్నారా?

**వడ్డీ రేట్ల భారాన్ని ఇలా తగ్గించుకోండి!**

**రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించినా ప్రజలకు మాత్రం ప్రయోజనం లేదు**

**ఈ క్రమంలో రుణగ్రహీతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తోన్న ఆర్థిక నిపుణులు!**



ప్రస్తుత రోజుల్లో బ్యాంకుల నుంచి లోన్లు తీసుకోవడం కామన్. సొంతిల్లు, కారు, పిల్లల ఉన్నత చదువులు, విహార యాత్రలు అంటూ రకరకాల అవసరాల కోసం రుణాలు తీసుకుంటున్నారు. అయితే, తీసుకున్న రుణాలపై వడ్డీ రేట్లు తగ్గితే సామాన్యుడికి ఎంతో ఊరట లభిస్తుంది. ఈ క్రమంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ కూడా వివిధ సందర్భాల్లో వడ్డీ రేట్లను తగ్గిస్తూనే ఉంది. అయితే, ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినా కూడా, వాటి ప్రయోజనాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందడం లేదని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక తాజాగా స్పష్టం చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ చేసిన వడ్డీ రేట్ల కోత ప్రయోజనాలు వినియోగదారులకు పాక్షికంగానే అందాయని వెల్లడించింది. అసలు బ్యాంకులు వడ్డీ రేట్లను ఎందుకు తగ్గించడం లేదు? ఇలాంటి పరిస్థితుల్లో రుణగ్రహీతలు ఏం చేయాలో ఆర్థిక నిపుణులు వివరిస్తున్నారు. అవి ఇప్పుడు చూద్దాం. ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేట్లను తగ్గిస్తూనే ఉంది. 2025 ఫిబ్రవరి నుంచి రెపో రేటును 6.50 శాతం నుంచి ప్రస్తుతం 5.25 శాతానికి చేర్చింది. అంటే, మొత్తంగా 125 బేసిస్ పాయింట్లు మేర కోత విధించింది. కానీ, రుణగ్రహీతలకు అందిన ప్రయోజనం అంతంతమాత్రమే. కొత్తగా తీసుకున్న రుణాలపై సగటు వడ్డీ రేటు కేవలం 93 బేసిస్ పాయింట్లు మాత్రమే తగ్గింది. ఎంసీఎల్ఆర్ ఆధారిత బెంచ్‌మార్క్ రేట్లు మరింత నెమ్మదిగా కేవలం 45 బేసిస్ పాయింట్ల మేరకే తగ్గడం గమనార్హం. ఆర్‌బీఐ రెపో రేట్లు తగ్గించినా బ్యాంకులు వెంటనే స్పందించకపోవడానికి ప్రధాన కారణం డిపాజిట్ల ఖర్చు అని నిపుణులు అంటున్నారు. బ్యాంకులు తమ లాభాలను కాపాడుకోవడానికి డిపాజిట్లపై ఇచ్చే వడ్డీని కూడా సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. బ్యాంకులు అనుసరించే రుణ విధానమూ ఇక్కడ కీలక పాత్ర పోషిస్తుంది. రెపో రేటుతో అనుసంధానించిన లోన్లకు వడ్డీ తగ్గింపు వేగంగా లభిస్తుంది. లేకపోతే నెమ్మదిగా తగ్గింపు అమలవుతుంది. వడ్డీ రేట్ల కోత ప్రయోజనం మీకు సరిగ్గా అందడం లేదనిపించినప్పుడు పలు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. అవేంటంటే ఎంసీఎల్ఆర్ నుంచి ఈబీఎల్ఆర్‌కు: మీ లోన్ పాత ఎంసీఎల్ఆర్ విధానంలో ఉంటే వడ్డీ రేటు తగ్గేందుకు చాలా సమయం పడుతుందని.. దీనిని రెపో రేటుతో ముడిపడి ఉండే ఈబీఎల్ఆర్ విధానానికి మార్చుకోవాలంటున్నారు. ఇలా చేయడం ద్వారా ఆర్‌బీఐ తగ్గించే ప్రతి పైసా ప్రయోజనం మీకు వేగంగా అందుతుందని చెబుతున్నారు. తక్కువ వడ్డీ ఉన్న బ్యాంకుకు మీ రుణాన్ని బదిలీ చేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చంటున్నారు. ఉదాహరణకు, మీరు రూ.30లక్షల హోమ్ లోన్‌ను 8.5 శాతం నుంచి 7.63 శాతం వడ్డీ ఉన్న బ్యాంక్‌కు బదిలీ చేసుకుంటే, నెలకు రూ.1,600 చొప్పున, 20 సంవత్సరాల కాలపరిమితిలో దాదాపు రూ.4లక్షల వరకు ఆదా చేసుకోవచ్చంటున్నారు. లోన్ ట్రాన్స్‌ఫర్ చేసేటప్పుడు కొత్త బ్యాంకు వసూలు చేసే , ఇతర ఖర్చులను పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు. ఈ ఖర్చులు మీకు మిగిలే వడ్డీ కంటే తక్కువగా ఉన్నప్పుడే బదిలీ చేసుకోవడం ఉత్తమం. ఈ ఖర్చులు ఎక్కువైతే అదే బ్యాంక్‌లో కొనసాగడం మంచిదంటున్నారు. మెరుగైన సిబిల్ స్కోరు ఉన్న వారికి బ్యాంకులు తక్కువ వడ్డీ రేట్లను అందిస్తాయంటున్నారు. కాబట్టి మీరు బదిలీకి దరఖాస్తు చేసే ముందు మీ క్రెడిట్ స్కోరు బాగుందని నిర్ధారించుకోవడం ముఖ్యమంటున్నారు. మీ రుణ కాలపరిమితి ఇంకా 10-12 ఏళ్లు మిగిలి ఉన్నప్పుడే లోన్స్‌ను వేరే బ్యాంకులు బదిలీ చేసుకోవడం మంచిదంటున్నారు. దీని వల్ల వడ్డీ ఆదా ఎక్కువగా కనిపిస్తుందని చెబుతున్నారు. లోన్ కాలపరిమితి ముగింపు దశలో ఉంటే, ఫీజుల రూపంలో అయ్యే ఖర్చే వడ్డీ ఆదాకన్నా ఎక్కువగా ఉండొచ్చంటున్నారు. ప్రస్తుతం వడ్డీ రేట్లు స్థిరీకరణ దశలో ఉన్నాయి. ఆర్‌బీఐ నుంచి మరిన్ని విధానపరమైన మార్పులు వచ్చే వరకూ వడ్డీ రేట్లలో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రుణగ్రహీతలు తమ రుణాల వడ్డీ రేట్లను ఒకసారి సమీక్షించుకొని, సరైన బెంచ్‌మార్క్ విధానాలకు మారడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకోవచ్చని సూచిస్తున్నారు.

# భవిష్యత్తులో బంగారం చేతికి కూడా చిక్కదు

**బంగారాన్ని వీలయినంత కొనిపెట్టుకోండి.. భవిష్యత్తులో చేతికి కూడా చిక్కదు.. కారణం ఏంటంటే..**



ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఆర్థిక ఒడిదుడుకుల నేపథ్యంలో, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. ముఖ్యంగా వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తున్న వ్యూహాలు పసిడి ధరలకు గట్టి మద్దతును ఇస్తున్నాయి. సాధారణంగా మార్కెట్‌లో ధరలు తగ్గినప్పుడు పెట్టుబడిదారులు ఆందోళన చెందుతారు. కానీ కేంద్ర బ్యాంకులు మాత్రం ఈ ధరల తగ్గుదలను ఒక అద్భుతమైన కొనుగోలు అవకాశంగా మలుచుకుంటున్నాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అందించిన తాజా గణాంకాల ప్రకారం, మార్చి నెలలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు సుమారు 30 టన్నుల బంగారాన్ని విక్రయించినప్పటికీ.. ఈ ఆ అమ్మకాల వెనుక నిర్దిష్ట ఆర్థిక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా టర్కీ, రష్యా దేశాలు తమ అంతర్గత అవసరాల కోసం ఈ విక్రయాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ అమ్మకాల ప్రభావాన్ని మించి అనేక దేశాలు బంగారాన్ని పెద్ద ఎత్తున సేకరిస్తున్నాయి. ముఖ్యంగా పోలాండ్, ఉజ్బెకిస్తాన్, కజకిస్తాన్ వంటి దేశాలు తమ విదేశీ మారక నిల్వల్లో వాటాను పెంచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇందులో అన్నింటికంటే ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. చైనా దేశం అనుసరిస్తున్న పద్ధతిని చెప్పుకోవచ్చు. చైనా సెంట్రల్ బ్యాంక్ గత 18 నెలలుగా నిర్విరామంగా తన బంగారు నిల్వలను పెంచుకుంటూ వస్తోంది. మార్చి నెలలో చైనా ఏకంగా 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఇది 2024 డిసెంబర్ తర్వాత జరిగిన అతిపెద్ద నెలవారీ కొనుగోలుగా రికార్డు సృష్టించింది. ఆ సమయంలో + ధరలు 2026 జనవరిలో ఉన్న గరిష్ట స్థాయి కంటే సుమారు 16 శాతం తక్కువగా ఉండటంతో.. చైనా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. కేవలం అగ్రరాజ్యాలు మాత్రమే కాకుండా, చిన్న దేశాలు సైతం ఇప్పుడు బంగారం వైపు మొగ్గు చూపుతున్నాయి. దీనికి ఉత్తమ ఉదాహరణ కొసావో. ఆ దేశం తన చరిత్రలోనే మొట్టమొదటిసారిగా అధికారికంగా బంగారాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా మారిన ఆర్థిక ముఖచిత్రానికి నిదర్శనం. గతంలో కేవలం సంపన్న దేశాలకే పరిమితమైన ఈ సురక్షిత పెట్టుబడి వ్యూహం, ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న చిన్న దేశాలకు కూడా పాకింది. కేంద్ర బ్యాంకులు ఇకపై కేవలం తక్షణ ధరల హెచ్చుతగ్గుల ఆధారంగా కాకుండా, దీర్ఘకాలిక భద్రత, ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ నిల్వల్లో బంగారం వాటా సుమారు 15 శాతంగా ఉంది. రాబోయే కాలంలో ఈ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తోంది. డాలర్ విలువలో వచ్చే మార్పులు లేదా అంతర్జాతీయ ఉద్రిక్తతల నుండి తమ ఆర్థిక వ్యవస్థలను రక్షించుకోవడానికి బంగారం ఒక బలమైన కవచంలా పనిచేస్తుందని దేశాలు భావిస్తున్నాయి. ఈ నిరంతర కొనుగోళ్లు మార్కెట్‌లో ఒక రకమైన స్థిరత్వాన్ని సృష్టిస్తున్నాయి. పెట్టుబడిదారులు మరిన్ని ఆర్థిక సంకేతాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో, కేంద్ర బ్యాంకుల మద్దతు బంగారం ధరలు భారీగా పడిపోకుండా కాపాడుతోంది. దీర్ఘకాలికంగా చూస్తే.. ఈ కొనుగోళ్ల జోరు పసిడి మార్కెట్‌కు ఒక గట్టి పునాదిని నిర్మిస్తోందని చెప్పవచ్చు.

## జీతం పెరిగినా ఎందుకు పొదుపు చేయలేకపోతున్నారు

మార్కెట్ ఒడిదుడుకులు ఎలా ఉన్నా కొందరు మాత్రం ఎప్పుడూ ధనవంతులుగానే ఎలా ఉంటారో అని చాలామందికి సందేహం వస్తుంటుంది. దీనికి ప్రధాన కారణం క్రమశిక్షణతో కూడిన పర్సనల్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్. వీరు డబ్బును ఒక రివార్డులా కాకుండా, సంపదను పెంచుకునే ఒక సాధనంగా చూస్తారు. తక్షణ ఆనందాల కంటే దీర్ఘకాలిక లక్ష్యాలకే వీరు ప్రాధాన్యత ఇస్తారు. ఈ మైండ్‌సెట్ వల్లే వారు నెలనెలా జీతం కోసం ఎదురుచూసే 'పే చెక్ టు పే చెక్' పరిస్థితి నుంచి బయటపడతారు. సంపదను కాపాడుకోవడంలో ఖర్చు చేసే తీరు కీలక పాత్ర పోషిస్తుంది. ఆర్థికంగా ఎదిగే వారు ఎప్పుడూ 'లైఫ్ స్టైల్ ఇన్‌ఫ్లేషన్' బారిన పడకుండా జాగ్రత్త పడతారు. అంటే, ఆదాయం పెరిగే కొద్దీ ఖర్చులను కూడా పెంచేయడం అన్నమాట. జీతం పెరిగినా ఖర్చులను అదుపులో ఉంచుకోవడం వల్ల వారు ఎక్కువ పొదుపు చేయగలుగుతారు. సామాజిక హోదా లేదా లగ్జరీ ట్రెండ్స్ కంటే తమ భవిష్యత్తు అవసరాలకే వీరు పెద్దపీట వేస్తారు. ఆర్థిక క్రమశిక్షణలో మొదటి మెట్టు ఒక పటిష్టమైన 'ఎమర్జెన్సీ ఫండ్' ఏర్పాటు చేసుకోవడం. కనీసం మూడు నుంచి ఆరు నెలల ఇంటి ఖర్చులకు సరిపడా డబ్బును పక్కన పెట్టుకోవాలి. ఉద్యోగం పోయినా లేదా అనారోగ్య సమస్యలు వచ్చినా ఇది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఎమర్జెన్సీ ఫండ్ ఉండటం వల్ల ఆర్థిక ఆందోళనలు గణనీయంగా తగ్గుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. ఆర్థికంగా నిలకడగా ఉండేవారు ఈ నిధిని కేవలం అత్యవసర పరిస్థితుల్లో తప్ప మరెప్పుడూ ముట్టుకోరు. రోజువారీ ఖర్చుల్లో చేసే చిన్న చిన్న మార్పులు కూడా అద్భుతమైన ఫలితాలను ఇస్తాయి. ఆర్థికంగా స్థిరపడిన వారు ప్రతి రూపాయి ఎక్కడికి వెళ్తుందో లెక్క చూసుకుంటారు. తమ 'డెట్ టు ఇన్‌కమ్ రేషియో'ను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్పులు పెరగకుండా చూసుకుంటారు. ఈ క్రమశిక్షణే వారి నికర ఆస్తి విలువ లేదా 'నెట్ వర్త్' పెరగడానికి దోహదపడుతుంది. ధనవంతులుగా మారడానికి భారీ జీతం ఉండాల్సిన అవసరం లేదు. మనం తీసుకునే ప్రతి ఆర్థిక నిర్ణయంపై స్పష్టత ఉంటే చాలు. పర్సనల్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ పై పట్టు సాధించి, లైఫ్ స్టైల్ ఇన్‌ఫ్లేషన్‌ను దూరం పెడితే ఎవరైనా సురక్షితమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. ఆలోచనా విధానంలో వచ్చే చిన్న మార్పులే మిమ్మల్ని ఆర్థిక స్వేచ్ఛ వైపు నడిపిస్తాం.


# ఇక టోల్ గేట్ల దగ్గర వెయిటింగ్ లేదు!

**80 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోవచ్చు**

**కేంద్రం సంచలన నిర్ణయం!**



మనం ఫ్యామిలీతో కలిసి కార్లో వెళ్తున్నప్పుడు లేదా అర్జంటుగా ఏదైనా బిజినెస్ పని మీద హైవే మీద ప్రయాణిస్తున్నప్పుడు అతి పెద్ద తలనొప్పి ఏదైనా ఉందంటే అది కచ్చితంగా టోల్ ప్లాజాలు. గతంలో కంటే ఇప్పుడు ఫాస్టాగ్ వచ్చిన తర్వాత పరిస్థితి కొంచెం మెరుగైనప్పటికీ, పండుగలు లేదా వీకెండ్స్ వంటి పీక్ అవర్స్ లో టోల్ గేట్ల దగ్గర కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అయితే, ఈ ట్రాఫిక్ తిప్పలన్నింటికీ, ఆ వెయిటింగ్ కష్టాలకూ శాశ్వతంగా స్వస్తి పలికేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ స్కెచ్ వేసింది. 2026 నాటికి ఊహించని మార్పు! కేంద్ర రోడ్డు రవాణా , రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ఒక సంచలన ప్రకటన చేశారు. 2026 చివరి నాటికి దేశంలోని జాతీయ రహదారులపై ఉన్న ఫిజికల్ టోల్ ప్లాజాలన్నింటినీ పూర్తిగా తొలగించబోతున్నారు. అంటే, ఇకపై మీరు హైవే మీద వెళ్తున్నప్పుడు టోల్ కట్టడం కోసం గేట్ల ముందు క్యూ కట్టాల్సిన అవసరం అస్సలు ఉండదు. గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ, ఎక్కడా బ్రేక్ వేయకుండా మీ గమ్యస్థానానికి చేరుకోవచ్చు. ఇది వినడానికి సినిమా కథలా ఉన్నా, మరో రెండేళ్లలో ఇది మన కళ్లముందే నిజం కాబోతోంది. ప్రస్తుతానికి మనకు రోడ్ల మీద పెద్ద పెద్ద టోల్ బూత్‌లు ఉన్నాయి, కానీ భవిష్యత్తులో ఇవి కనుమరుగు కానున్నాయి. దీని కోసం ప్రభుత్వం, శాటిలైట్ ఆధారిత టోలింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెడుతోంది. మీ కారు నంబర్ ప్లేట్‌ను హైవేలపై అక్కడక్కడ ఏర్పాటు చేసే హై-టెక్ కెమెరాలు ఆటోమేటిక్‌గా స్కాన్ చేస్తాయి. మీరు హైవేలోకి ఎక్కడ ఎంట్రీ ఇచ్చారు, ఎక్కడ ఎగ్జిట్ అయ్యారు అనేది ఈ సిస్టమ్ ఖచ్చితంగా ట్రాక్ చేస్తుంది. దీనివల్ల మీరు ప్రయాణించిన కిలోమీటర్ల దూరాన్ని బట్టి ఖచ్చితమైన టోల్ రేట్లు లెక్కించబడతాయి. ఆ అమౌంట్ నేరుగా మీ బ్యాంక్ అకౌంట్ లేదా వాలెట్ నుండి ఎటువంటి మనిషి ప్రమేయం లేకుండా కట్ అవుతుంది. ఈ కొత్త టెక్నాలజీ విధానం వల్ల మనకు చాలా ప్రయోజనాలు ఉన్నాయి. సమయం ఆదా: టోల్ గేట్ల దగ్గర వెయిటింగ్ టైమ్ సున్నా అవుతుంది. గంటల కొద్దీ క్యూలో ఉండాల్సిన బాధ తప్పుతుంది. ఇంధన పొదుపు: ట్రాఫిక్ జామ్‌లో కారు ఇంజిన్ ఆన్ చేసి ఉంచడం వల్ల చాలా పెట్రోల్, డీజిల్ వృధా అవుతుంది. టోల్ ప్లాజాలు లేకపోతే ఆ ఇంధనం ఆదా అవుతుంది, ఇది పర్యావరణానికి కూడా మంచిదే. న్యాయమైన పేమెంట్: ఇప్పటివరకు ఒక టోల్ గేట్ దాటితే, మీరు కేవలం 10 కిలోమీటర్లు వెళ్లినా, లేదా 50 కిలోమీటర్లు వెళ్లినా ఒకే రకమైన ఫిక్స్‌డ్ టోల్ కట్టాల్సి వచ్చేది. కానీ ఇకపై మీరు ఎంత దూరం ప్రయాణిస్తే అంతకే డబ్బులు కట్టాలి. ఇది సామాన్యుడికి పెద్ద ఊరట. ఈ మార్పు కేవలం ప్రయాణం స్పీడ్ పెంచడమే కాదు, దేశ రవాణా రంగాన్ని కూడా మరో లెవల్‌కు తీసుకువెళుతుంది. వస్తువుల రవాణా వేగంగా జరగడం వల్ల మార్కెట్‌లో వస్తువుల ధరలు కూడా తగ్గే అవకాశం ఉంది.



# రౌడీ గుండెలపై కాలు పెట్టిన కీర్తి సురేశ్.. విజయ్ బర్త్‌డే పోస్టర్!


విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమాల్లో రౌడీ జనార్దన్ కూడా ఒకటి. దిల్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్, గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. విజయ్ బర్త్‌డే సందర్భంగా నేడు(మే 9) మరో కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. గతంలో రిలీజ్ చేసిన పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపించిన విజయ్.. కొత్త పోస్టర్ లవ్లీగా కనిపించాడు. 'ప్రపంచంతో పోరాడతాడు.. ప్రేమకు లొంగిపోతాడు' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. అందులో విజయ్ వర్షంలో తడుస్తూ, చేతిలో తుపాకీ పట్టుకొని కూర్చొని ఉండగా.. అతని గుండెలపై ఒక అమ్మాయి కాలు పెట్టినట్లు ఈ పోస్టర్ డిజైన్ చేశారు. ఇందులో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటిస్తున్నారు. తొలిసారి తూర్పుగోదావరి యాసలో విజయ్ మాట్లాడబోతున్నాడు. 80వ దశకం నేపథ్యంలో కథనం సాగుతుంది. ఈ ఏడాది చివరిలో ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఉంది.

# ఫుల్ స్వింగ్‌లో రవితేజ 'ఇరుముడి'.. షూటింగ్ చివరి దశకు చేరిన మాస్ మహారాజ మూవీ!




మాస్ మహారాజ రవితేజ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఇరుముడి ప్రస్తుతం టాలీవుడ్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా మొదటి అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది. ముఖ్యంగా డివోషనల్ టచ్‌తో పాటు ఎమోషనల్ డ్రామాను కలగలిపిన కథాంశంతో ఈ సినిమా రాబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు భారీగా పెరిగాయి. ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ గత చిత్రాలకు భిన్నంగా ఓ పవర్‌ఫుల్ మరియు భావోద్వేగభరిత పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. మాస్ ఎలిమెంట్స్‌తో పాటు బలమైన భావోద్వేగాలు కూడా సినిమాలో ప్రధాన ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, తాజాగా లభించిన సమాచారం ప్రకారం చిత్రీకరణ దాదాపు చివరి దశకు చేరుకుందని తెలుస్తోంది. ఇంకా సుమారు నెల రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో మేకర్స్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో పనులు పూర్తి చేసే దిశగా ముందుకెళ్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని జీవి ప్రకాష్ కుమార్ అందిస్తున్నారు. ఇప్పటికే పలువురు భిన్నమైన ప్రాజెక్టులతో తన మార్క్ చూపించిన జీవి ప్రకాష్.. 'ఇరుముడి' కోసం కూడా ప్రత్యేకమైన మ్యూజిక్ వర్క్ చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా ఈ సినిమా కాన్సెప్ట్ పట్ల ఆయనే ఎంతో ఎగ్జైటెడ్‌గా ఉన్నారని టాలీవుడ్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇటీవల వరుస విజయాలతో టాప్ ప్రొడక్షన్ హౌస్‌గా నిలిచిన మైత్రి సంస్థ.. 'ఇరుముడి'ని కూడా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. రవితేజ కెరీర్‌లో ఈ సినిమా ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశాలు ఉన్నాయని అభిమానులు భావిస్తున్నారు. యాక్షన్, భక్తి, ఎమోషన్‌ల మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే మంచి బజ్ సంపాదించుకోవడం విశేషం. అన్ని పనులు పూర్తి చేసిన తర్వాత ఈ సినిమాను అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

# సత్యదేవ్ 'రావు బహదూర్' విడుదల వాయిదా.. కొత్త డేట్ ఫిక్స్!




వెర్సటైల్ నటుడు సత్యదేవ్, విలక్షణ దర్శకుడు వెంకటేష్ మహా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్' విడుదల తేదీ మరోసారి మారింది. ఈ చిత్రాన్ని తొలుత జూన్ 5న విడుదల చేయాలని చిత్ర బృందం భావించినప్పటికీ, జూన్ 4న రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల కానున్న నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద క్లాష్‌ను తప్పించడానికి మేకర్స్ వెనక్కి తగ్గారు. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూలై 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సొంత బ్యానర్ 'జీఎంబీ ఎంటర్‌టైన్‌మెంట్' ద్వారా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంతో పాటు కథ, స్క్రీన్‌ప్లే మరియు ఎడిటింగ్ బాధ్యతలను కూడా స్వయంగా నిర్వహిస్తున్నారు. సత్యదేవ్ సరసన దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాల పరాశర్, ఆనంద్ భారతి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఒక పురాతన రాజవంశం, వారసత్వం మరియు రహస్యాల చుట్టూ తిరిగే గ్రిప్పింగ్ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో సత్యదేవ్ పవర్ ఫుల్ ఎల్డర్లీ లుక్‌లో కనిపించబోతున్నారు. 'అనుమానం పెనుభూతం' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే విడుదలైన పోస్టర్లు మరియు 'ఓ సుందరి' సాంగ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి.



# మంచులో మెరిసిన సమంత.. గ్లామర్‌తో పాటు తన ఆలోచనలతోనూ ఆకట్టుకున్న టాలీవుడ్ క్వీన్!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు మరోసారి తన స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు. ప్రముఖ మ్యాగజైన్ "ది నాడ్" మే 2026 ఎడిషన్ కోసం సమంత చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. గ్లామర్, ఎలిగెన్స్, స్టైల్ అన్నీ కలిసిన ఈ ఫోటోషూట్‌లో సమంత పూర్తిగా కొత్త అవతారంలో కనిపించి అభిమానులను ఫిదా చేస్తున్నారు. ఈ షూట్‌లో సమంత ధరించిన ప్రతి అవుట్‌ఫిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా డీప్ నెక్ డిజైన్‌తో ఉన్న మెటాలిక్ మెష్ గౌన్‌లో ఆమె లుక్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. మంచు నేపథ్యంతో చేసిన ఈ ఫోటోషూట్‌లో సమంత ఒక దేవకన్యలా కనిపించారని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. డ్రెస్‌కు జత చేసిన అద్దాల టాసెల్స్, స్టైలిష్ మేకోవర్ మొత్తం షూట్‌కు ఒక డ్రామాటిక్ టచ్ ఇచ్చాయి. ఇక మరో లుక్‌లో ఐవరీ కలర్ ముత్యాల డ్రెస్‌లో సమంత మరింత గ్రేస్‌ఫుల్‌గా మెరిసిపోయారు. ప్రత్యేకంగా చేత్తో కుట్టిన ముత్యాలతో డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌కు బుల్గారీ జ్యువెలరీ, రెనే కావిల్లా ఫుట్‌వేర్ జత కావడంతో ఆమె లుక్ మరింత రిచ్‌గా మారింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతుండగా, ఫ్యాన్స్ "సామ్ అంటే స్టైల్‌కు మరో పేరు" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఈ ఫోటోషూట్ కేవలం గ్లామర్‌కే పరిమితం కాలేదు. ఈ సందర్భంగా సమంత చేసిన వ్యాఖ్యలు కూడా ఆసక్తికరంగా మారాయి. "ఈ సినిమాలో హీరో ఎవరు?" అని అడిగితే.. "నేను ఇకపై అలాంటి సినిమాలు చేయడం లేదు" అంటూ సమంత కూల్‌గా సమాధానం ఇచ్చారు. తాను ఎంచుకునే సినిమాల్లో కథే అసలైన హీరో అని, నటుల కంటే కథకు ప్రాధాన్యత ఎక్కువగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మహిళల భావోద్వేగాలు, ఆలోచనలకు ప్రతిబింబంగా ఉండే పాత్రలనే ఇప్పుడు ఎంపిక చేసుకుంటున్నానని సమంత వెల్లడించారు. సినిమా ప్రపంచంలో మార్పు రావాలంటే రిస్క్ తీసుకోవాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. సమంత మాటలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# 'పని రాక్షసుడు' నాని.. 'ప్యారడైజ్' కోసం నేచురల్ స్టార్ పడుతున్న కష్టం ఇదే!

నాని.. ఈ పేరు ఇప్పుడు తెలుగు సినీ ఇండస్ట్రీలో ఒక బ్రాండ్‌గా మారిపోయింది. అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన, తన టాలెంట్, కష్టంతో నేచురల్ స్టార్ స్థాయికి ఎదిగారు. ప్రతి పాత్ర కోసం పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే నాని డెడికేషన్ గురించి ఇండస్ట్రీలో ప్రత్యేకంగా మాట్లాడుకుంటుంటారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న అవైటెడ్ మూవీ ప్యారడైజ్ కోసం నాని పడుతున్న కష్టం గురించి ఆయన జిమ్ ట్రైనర్ విశ్వ భరత్ వెల్లడించిన విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న విశ్వ భరత్.. నానితో తన ప్రయాణం ఎలా మొదలైందో చెప్పుకొచ్చాడు. హిట్ 2 సమయంలో నానితో పని చేయడం ప్రారంభించానని, అప్పటి నుంచి ఆయన డెడికేషన్‌ను దగ్గరగా చూస్తున్నానని వెల్లడించాడు. "నాని అన్న పని విషయంలో నిజంగానే రాక్షసుడు. సోషల్ మీడియాలో కొంతమంది ఆయనపై నెగెటివ్ కామెంట్లు చేస్తుంటే నాకు కోపం వస్తుంది. ఎందుకంటే ఆయన ఎంత కష్టపడతారో నేను దగ్గరగా చూస్తున్నాను" అని విశ్వ పేర్కొన్నాడు. ప్రస్తుతం 'ప్యారడైజ్' షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో సాగుతోందని, ఆ సినిమా కోసం నాని తన శరీరాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారని తెలిపాడు. "ఉదయం 5 గంటలకు లేచి, 6 గంటలకే సెట్స్‌లో ఉంటారు. సాయంత్రం 7 గంటల వరకు యాక్షన్ సీన్లు చేస్తూనే ఉంటారు. రోప్స్ కట్టుకుని చేసే యాక్షన్ సీక్వెన్స్‌ల వల్ల బాగా అలసిపోతారు. అయినా అక్కడితో ఆగరు" అని విశ్వ చెప్పాడు. షూటింగ్ ముగిసిన తర్వాత కూడా నాని విశ్రాంతి తీసుకోకుండా వర్కౌట్ కొనసాగిస్తారని వెల్లడించాడు. సాయంత్రం ఆయన అసిస్టెంట్ నుంచి నాకు కాల్ వస్తుంది. నాని అన్న 40 నిమిషాలు ఇంట్లో ఉంటారు.. వర్కౌట్ చేస్తారు అని చెప్తారు. అప్పటికే ఉదయం నుంచి షూటింగ్‌లో అలసిపోయి ఉన్నా, మరో 45 నిమిషాలు కచ్చితంగా జిమ్ చేస్తారు. ఇవాళ వదిలేద్దాం అని ఎప్పుడూ అనరు అంటూ నాని క్రమశిక్షణను ప్రశంసించాడు. నాని తన పాత్రల కోసం ఎంతగా కష్టపడతారో చెప్పేందుకు విశ్వ మరో ఉదాహరణ కూడా ఇచ్చాడు. జెర్సీ సినిమా కోసం నాని ప్రత్యేకంగా క్రికెట్ శిక్షణ తీసుకున్నారని గుర్తుచేశాడు. "ఆ సినిమాలో అర్జున్ పాత్ర కోసం ఆయన పూర్తిగా క్రికెటర్‌లా మారిపోయారు. ఆయన ఆట చూసి మాజీ భారత క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా మెచ్చుకున్నారు. 'నువ్వు నిజంగానే ప్రొఫెషనల్ క్రికెటర్‌లా ఆడావు' అని చెప్పారట" అని విశ్వ వెల్లడించాడు. ఇప్పుడు 'ప్యారడైజ్'లో జడల్ పాత్ర కోసం కూడా అదే స్థాయిలో కష్టపడుతున్నారని చెప్పాడు. విశ్వ చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నాని అభిమానులు "ఇంత డెడికేషన్ ఉన్న హీరోకే విజయాలు వస్తాయి , నేచురల్ స్టార్ అంటే ఇదే" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.